# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 13 ఆగష్టు 2025




విజయవాడలోని మెరీస్ స్టెల్లా కళాశాలలో రాష్ట్రంలో అమలు పరుస్తున్న విద్యా కార్యక్రమాలపై డైట్ అధ్యాపకులకు నిర్వహించిన ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో పాఠశాల విద్యాశాఖ గౌరవ కమిషనర్ శ్రీ విజయరామరాజు, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ శ్రీ మార్తాల వెంకట కృష్ణారెడ్డి.

## 76.43 శాతం పోలింగ్

**ఎన్నికల తరలిని పరిశీలించిన జిల్లా కలెక్టర్, డిఐజి**

పులివెందుల , ఆగస్ట్ 12, ప్రభాత వార్త:

పులివెందుల ఉప ఎన్నికల్లో 76.43 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటపతి తెలిపారు. ఎన్నికల సరళి ని జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, కర్నూల్ డిఐజి కోయా ప్రవీణ్ పరిశీలించారు. మొత్తం ఓట్లు 10601 ఓట్లకు గాను 8103 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో 449 మంది పురుషులు 3684 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బ్యాలెట్ బాక్స్ లను ప్రత్యేక వాహనాల ద్వారా పోలీస్ బందోబస్తుతో కడపకు తరలించారు.



పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# సీఎంకు కానుకగా ఇస్తాం : మంత్రి రాంప్రసాద్ రెడ్డి

కడప కార్పొరేషన్, ఆగస్టు 12 ప్రభాతవార్త:

ఉమ్మడి కడప జిల్లాలో నిర్వహించిన రెండు జడ్పిటిసి స్థానాలను టిడిపి కైవసం చేసుకుంటుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మంగళవారం హోటల్ మానస ఇన్ లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు ఒంటిమిట్ట జడ్పిటిసి ఎన్నికల ఇన్చార్జిగా తనను నియమించారని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తాము ప్రజలను కోరామని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో భద్రాచలం తెలంగాణకు వెళితే, ఒంటిమిట్ట కోదండరామ స్వామి ఉత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని గుర్తు చేశారు. రెండు జెడ్పిటిసి స్థానాలు గెలిచి సీఎంకు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు. కొన్ని మీడియా ఛానళ్లలో మంత్రి రౌడీయిజం చేస్తున్నాడని ప్రచారం చేయడం దుర్మార్గమన్నారు. టిడిపి కార్యకర్తకు ఆపద వస్తే పార్టీ తరపున తాము ఆదుకుంటామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజాస్వామ్యం ఉంది కాబట్టే వైసిపి అభ్యర్థులు నామినేషన్ వేశారని గుర్తుపెట్టుకోవాలన్నారు. జగన్మోహన్ రెడ్డి హయాంలో మూడు కోట్లకు పైగా ఓటు హక్కు ఉన్న స్థానాలను ప్రత్యర్థులను భయపెట్టి ఏకగ్రీవం చేశారని, ప్రస్తుతం 35 వేల ఓట్లు ఉన్న స్థానానికి మాత్రమే ఇక్కడ ఎన్నికలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఎవరి హయాంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేశారో దీనిని బట్టి స్పష్టమవుతుందని తెలిపారు. అభ్యర్థులను కనీసం నామినేషన్ కూడా వేయించలేదని చెప్పారు. ప్రేమ, అనురాగాలతో ఓటు అడిగాము తప్ప, ఎక్కడ రాజీ, లాలూచీ తాము పడలేదని పేర్కొన్నారు. టిడిపి ఏజెంట్ల పై వైసీపీ మూకలు రౌడీయిజం, దుర్భాషలాడడం చేశారని తెలిపారు. పెన్నర్ల్ల ఓటు హక్కు వినియోగించుకునేందుకు వెళితే వైసిపి మూకలు బెదిరించాలని చెప్పారు. ఎమ్మెల్యే ఆర్కే పార్టీ అమర్నాథ్ రెడ్డి మంత్రి రాంప్రసాద్ రెడ్డికి ఇక్కడ ఏం పని అనడం హాస్యాస్పదమన్నారు. దేశంలో ఎక్కడికైనా పోయే హక్కు భారత పౌరుడిగా తనకు ఉందని గుర్తుంచుకోవాలన్నారు. ఎన్నికలు చూడని గ్రామాలు ఈ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్నాయని



పేర్కొన్నారు. విజయం సాధించడం తధ్యమని తెలిపారు. ఈ ఎన్నికల్లో రాజకీయాలు కొత్త పుంతలు తొక్కయని ఇళ్ల వద్దకు పోయి బెదిరించాలని, ఏజెంట్లుగా కూర్చోకుండా భయపెట్టారని చెప్పారు. 14 నెలలలో జగన్మోహన్ రెడ్డి చేసింది శూన్యమని పేర్కొన్నారు. 420, 840 వాళ్ళ వద్దకు వెళ్లి పరామర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడ ఎన్నికలు జరిగినా టిడిపి విజయం సాధ్యమని తెలిపారు.

## ఓటు హక్కును వినియోగించుకోని వైకాపా జడ్పీటీసీ అభ్యర్థి

పులివెందుల, ఆగస్ట్ 12, ప్రభాత వార్త:



పులివెందుల జడ్పిటిసి ఉప ఎన్నికల్లో వైకాపా అభ్యర్థి తుమ్మలూరు హేమంత్ రెడ్డి తన స్వగ్రామం ఆర్ తుమ్మలప ల్లి గ్రామంలో తన ఓటు హక్కును వినియోగించు కోలేదు. ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డిని అరెస్ట్ చేయడంతో వైకాపా పార్టీకి చెందిన ఏజెంట్లు అందరూ పోలింగ్ బూతులు నందు కూర్చోకుండా బాయ్ కాట్ చేశారు. దీనితో హేమంత్ రెడ్డిని ఇంటి నుంచి బయటకు వస్తే ఘర్షణలు జరిగే అవకాశం ఉండడంతో పోలీసులు కొద్దిసేపు గృహ నిర్బంధం చేశారు. అయితే సమస్య సర్దు మునిగిన తర్వాత హేమంత్ రెడ్డిని ఓటు వేయడానికి వెళ్ళమని పోలీసులు కోరగా అంతా అయిపోయాక ఓటు వేసి ఏమి లాభం నా ఓటుకు నేను వెళ్ళను అంటూ ఓటు వేయకుండా ఇంటిలోనే గడిపారు. అంతకుమునుపు ఉదయం గృహనిర్బంధం చేసినట్లు అప్రజాస్వామ్యక పద్ధతిలో ఎన్నికలు జరుగుతున్నాయి అంటూ మీడియాకు వీడియో విడుదల చేశారు. పోలీసులు అనుమతులు ఇచ్చిన కూడా హేమంత్ రెడ్డి ఏ పోలింగ్ బూత్ లో కూడా ఏజెంట్లు లేరు కావున నేను వెళ్లి ఓటు వేసి ఏమి లాభమని వెళ్లకుండా పోలీసుల అభ్యర్థనను తిరస్కరించారు.

### ఓటర్ల దగ్గర స్లిప్పులు లాక్కొని

# టిడిపి గుండాలే ఓట్లు వేశారు

- ఇవి దద్దమ్మ ,చెత్తఎన్నికలు
- టీడీపీ కార్యకర్త లా పనిచేసిన డీఐజీ,ఎస్పీ లు
- ఏజెంట్లు కూడా తరిమి కొట్టిన టీడీపీ రౌడీ మూకలు
- ఎన్నికల తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి

పులివెందుల , ఆగస్ట్ 12, ప్రభాత వార్త:



పులివెందుల జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్య చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రాథమిక హక్కులను కోటమ్మ ప్రభుత్వం కాలరాసిందని ,ఓటర్ల దగ్గర స్లిప్పులు లాక్కొని టిడిపి గుండాలే ఓట్లు వేశారని, ఇవి దద్దమ్మ, చెత్త ఎన్నికలు అని, డీఐజీ ప్రవీణ్, ఎస్పీ అశోక్ కుమార్ పచ్చ చొక్కా తొడుక్కుని టిడిపి కార్యకర్తలుగా వ్యవహరించారని, ఎక్కడ కూడా వైకాపా తరఫున ఏజెంట్ అనే లేకుండా దౌర్జన్యాలకు పాల్పడ్డారని ఎన్నికల జరిగిన విధానంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని కడప పార్లమెంటు సభ్యుడు ఎంపీ అవినాష్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ పులివెందుల పట్టణ పోలీస్ స్టేషన్ కు రావాలని డీఐజీ తన కార్యాలయానికి వచ్చి కోరడం జరిగిందని ఆయన కోరిన విధంగా పోలీస్ స్టేషన్ కు వస్తే అప్పటికే రాసుకున్న స్క్రిప్ట్ లో సంతకం పెట్టమని అడిగారనీ అందులో అన్ని అవాస్తవాలు అని అందుకే నేను సంతకం పెట్టకుండా నిరాకరించానని ఉదయం తెల్లవారుజామున ఇంటిలోనే ఉంటాను నేను ఎక్కడికి వెళ్ళాను ఎవరితోనూ మాట్లాడను అని చెప్పిన ఎంపీ అని చూడకుండా ఈడ్చుకుంటూ పోలీసులు తీసుకువెళ్లిన తీరు చూస్తే ఇది ప్రజాస్వామ్యమేనా అన్న సందేశం కలుగుతుందన్నారు. 15 బూతుల్లో పోలింగ్ ప్రశాంతంగా రిగ్గింగ్ చేసుకోవడం జరిగిందన్నారు. కణంపల్లె లో ఓటర్లు పోలీస్ అధికారుల కాళ్ల పట్టుకున్న ఓటు వేయనివ్వలేదన్నారు అలాగే అచ్చవెల్లి, ఎర్రిపల్లి గ్రామాలలో వైకాపా తరుపున ఏజెంట్ ను కూర్చునీకుండా ఈడ్చడం జరిగిందన్నారు. ఒక్క పోలింగ్ కేంద్రంలో కూడా ఏజెంట్ లేకుండా చేసుకొని ఓటర్లను రానివ్వకుండా ఓట్లు వేసుకున్నారన్నారు.. గ్రామాలలో ఎవరిని కూడా ఓటు వేయకుండా వాళ్లే క్యూలో నిలబడి ఓటు వేసుకున్నారనీ,ఎంతో మంది మహిళలు ,ప్రజలు పార్టీ కార్యాలయానికి వచ్చి ఓట్లు వేయలేదని చెప్పడం జరిగిందన్నారు. ఎన్నికల కమిషన్ పోటీ చేసిన అభ్యర్థులందరికీ ఉదయం నుంచి పోలింగ్ అయిపోయిన తర్వాత 10 గంటల సమయం కలిగిన వెబ్ కాస్టింగ్ ను అంది వాళ్ళని అలాగే బయటి సీసీ ఫుటేజ్ అందించాలని కోరారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు కమలాపురం ల నుంచి వందల సంఖ్యలో జనాలను దింపి గ్రామస్తులను భయపెట్టి రౌడీజంతో ఓటింగ్ చేసుకున్నారన్నారు. దీనిపై కోర్టుకి వెళ్తామని కోర్టులో కచ్చితంగా న్యాయం జరుగుతుందన్నారు. పోలీసులు పూర్తిగా టిడిపికి సహకరించాలన్నారు. ప్రజల ప్రాథమిక హక్కును నేడు కుటుంబ ప్రభుత్వం కాలరాశిందన్నారు. అంతకు మునుపు అచ్చివెల్లి, కణంపల్లి, నల్లగొండు వారి పల్లి గ్రామస్తులు తమను ఓటును వేసుకొని ఇవ్వలేదని ఎంపీ అవినాష్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఆయన స్పందిస్తూ ఇక్కడ మనకు న్యాయం జరగదు కోర్టులోనే కోర్టుకెళ్దాం అక్కడ న్యాయం జరుగుతుందని వారికి భరోసా ఇచ్చారు.

## ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికల నిర్వహించాం

- అప్పుడు రాజారెడ్డి రాజ్యాంగం ఇపుడు అంబేద్కర్ రాజ్యాంగం
- సూపర్ సిక్స్ అమలు చేసి సూపర్ చెక్ పెడతాం
- పులివెందుల, ఒంటిమిట్ట లో టీడీపీదే గెలుపు
- ప్రచారంలో నోటిపై సమస్యలను వందరోజుల్లో పరిష్కరిస్తాం
- మంత్రి సవిత,విఫ్ ఆది, అధ్యక్షుడు వాసు,బీటెక్



పులివెందుల,ఆగస్ట్ 12 , ప్రభాత వార్త:

పులివెందుల జడ్పీటీసీ ఉపఎన్నిక పోలింగ్ ప్రజాస్వామ్య పద్ధతిలో జరిగింది అని ,అప్పట్లో రాజారెడ్డి రాజ్యాంగం పులివెందులలో ఉండేది అని నేటి నుంచి అంబేద్కర్ రాజ్యాంగం అమలులోకి వచ్చింది అని కడప జిల్లా ఇంచార్జి మంత్రి సవిత, విఫ్ ఆదినారాయణరెడ్డి,జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, పులివెందుల నియోజకవర్గ ఇన్చార్జ్ బీటెక్ రవిలు అన్నారు. మంగళ వారం సాయంత్రం పోలింగ్ అనంతరం స్థానిక తెదే పా కార్యాలయం నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పులివెందులలో మొదటిసారి ప్రజాస్వామ్య పద్ధతిలో పోలింగ్ జరిగిందని ఏడాది పాలన నచ్చి ప్రజలు టీడీపీకి ఓటు వేశారు అని ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డితో పాటు టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని కూడా అరెస్ట్ చేశారు అని పోలీసులు ఇరు వర్గాలను సమానంగా చూసారు అని వారు అన్నారు. సతీష్ రెడ్డి డిఎస్పిని బెదిరించడం నేడు ఇష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నాడని సతీష్ రెడ్డి వైఎస్ కుటుంబ బాధితుల ని మరిచిపోయి మాట్లాడుతు న్నారన్నారు.జగన్ దాచుకున్న సొమ్మును బయటకు తీశామన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలుచేసి పులివెందులలో వైసిపికి చెక్ పెడతామన్నారు. ప్రచార సమయంలో ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను కచ్చితంగా వంద రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. పులివెందుల ఒంటిమిట్ట రెండు జడ్పిటి స్థానాలను టిడిపి కైవసం చేసుకోబోతుందన్నారు.టీడీపీ కి మద్దతు ఇచ్చిన ప్రజలకు ,నాయకులకు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఒంటిమిట్టలో కూటమి అభ్యర్థి గెలుపు ఖాయం

**టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్ రాజు**

రాజంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:



జడ్పీ ఉప ఎన్నికల్లో ఒంటిమిట్ట జడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన ముద్దు కృష్ణారెడ్డి గెలుపు ఖాయం అని టీడీపి ఇజిల్లా అధ్యక్షుడు చమర్తిజగన్‌మోహన్ రాజు ధీమా వ్యక్తం చేశారు. ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అహర్నిషలు శ్రమించాయని కొనిఆడారు. ఒంటిమిట్ట మండలంలో గత కొన్నేళ్లుగా ఆధిపత్య రాజకీయాలతో అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు పార్టీ శ్రేణులు శ్రమించాయని పేర్కొన్నారు. సమిష్టి కృషి వల్లే అభ్యర్థి గెలవనున్నారని పేర్కొన్నారు. ఎన్నికల్లో కూటమి అభ్యర్థి గెలుపు కోసం కృషి చేసిన కూటమి పార్టీల నేతలకు, కార్యకర్తలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

## అశ్రు నయనాలతో మాజీ ఎమ్మెల్యే మదన్‌కు వీడ్కోలు

రాజంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:

రాజంపేట మాజీ శాసనసభ్యుడు డాక్టర్ కసిరెడ్డి మదన్‌మోహన్ రెడ్డికి అశ్రు నయనాలతో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పెద్దఎత్తున రాజంపేట నియోజికవర్గంకు తరలివెళ్లిన నేతలు అంతిమ వీడ్కోలు పలికారు. బంజారా హిల్స్‌లోని మహా ప్రస్థానంలో అంత్యక్రియలను నిర్వహించారు. పలువురు నేతలు మదన్‌మోహన్ రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్సీ బత్యాల చెంగల్‌రాయుడు మదన్ మోహన్ రెడ్డి పార్థీవ దేహం వద్ద నివాళులు అర్పించారు. మదన్‌మోహన్ రెడ్డి సతీమణి, కుమారులు రాం, రాహుల్‌ను ఆయన ఓదార్చారు. రాజంపేట నియోజికవర్గానికి మదన్‌మోహన్ రెడ్డి ఎనలేని సేవ చేశారని కొనిఆడారు. ఆయన హయాంలో నియోజికవర్గంలో మౌళిక సదుపాయాలు కల్పించారని పేర్కొన్నారు.



# ఒంటిమిట్ట ఉప పోరులో ఉద్రిక్తత

- మంత్రి వచ్చారని వైసీపీ నేతలు పోలింగ్ కేంద్రాల వద్దకు
- సాలా బాదు, మంటపం పల్లె, చిన్న కొత్తపల్లెలో ఘర్షణ
- రీ పోలింగ్ జరపాలని రిటర్నింగ్ అధికారికి వైసీపీ అభ్యర్థి ఫిర్యాదు
- ఒంటిమిట్టలో 79.33శాతం పోలింగ్



వైసీపీ నేతలు ఎస్పీ విద్యాసాగర్ నాయుడుతో వాగ్వివాదం

రాజంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:

ఒంటిమిట్టలో జడ్పీ ఉప పోరు ఉద్రిక్తంగా మారింది. ఎవరికి ఆధిపత్యం ఉన్న చోట వారు రిగ్గింగ్ ప్రయత్నాలకు పాల్పడటంతో పోటాపోటీగా మారి సమస్యకు దారి తీసింది. ఒక వైపు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి వైసీపీ స్లైక్లింగ్‌కు పాల్పడిందని మంటపం పల్లెకు వెళ్లారు. దీంతో అక్కడికి వైసీపీ నేతలంతా చేరుకున్నారు. అంతకుముందు కూడ సాలబాద్‌లో వైసీపీ, టీడీపీ శ్రేణులు రిగ్గింగ్ మీరు చేశారంటే మీరు చేశారంటూ అక్కడికి పెద్దఎత్తున చేరుకున్నారు. దీంతో 29, 30 పోలింగ్ కేంద్రాల్లోకి మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఎలా వెళతారంటూ కమలాపురం మాజీ ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడును ప్రశ్నించారు. మంత్రి రావడంతోనే మేమంతా రావడం జరిగిందని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్ రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్ బాష, రైల్వేకోడూరు మాజీ ఎమ్మెల్యే కోరుముట్ల శ్రీనివాసులు ఎస్పీతో వ్యాఖ్యానించారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని ఎస్పీ సూచించారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని కడప రిమ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మరోవైపు మంత్రి మండిపల్లిని కూడ అక్కడి నుంచి పంపించి వేశారు. మంటపం పల్లెలో మొదట వైసీపీ ఏజెంట్లు స్లైకింగ్ చేసినట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో రభస స్టార్ అయింది. మరోవైపు ఉదయం చింతరాజు పల్లె పంచాయతీలోని గాండ్ల పల్లె పోలింగ్ కేంద్రంలో టిడిపి, వైసీపీ శ్రేణులు ఘర్షణకు దిగాయి. టీడీపీ ఏజెంట్లు వైసీపీ ఏజెంట్‌ను లాగి వేశారు. ఆ తర్వాత పోలీసులు చేరుకొని పరిస్థితిని అదుపు చేశారు. మరోవైపు నడింపల్లిలో వైసీపీ, టీడీపీ వర్గాలు వాగ్వివాదం చేసుకున్నారు. వైసీపీ అభ్యర్థి ఇరగం రెడ్డి వెంకటసుబ్బారెడ్డి టిడిపి నేతలను అంతు చూస్తానని బెదిరించారని మంత్రికి ఫిర్యాదు చేశారు. వెంటనే మంత్రి ఇరగంరెడ్డిని అడ్డుకునేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు. ఈ క్రమంలో చిన్న కొత్తపల్లెలో వైసీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు దిగాయి. స్థానికేతరులు వచ్చి దొంగ ఓట్లు వేస్తుండటంతో టీడీపీ ఏజెంట్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మధ్య ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. వైసీపీ ఏజెంట్‌ను గ్రామస్థులంతా ఏకమై దాడి చేశారు. ఈ విశయం తెలుసుకొని మంత్రి అక్కడికి చేరారు. అక్కడే వైసీపీ అభ్యర్థి మంత్రికి తారాసపడ్డారు. కవ్వింపు చర్యలు వద్దని మంత్రి హెచ్చరించారు. అలాగే ఈ క్రమంలో ఒంటిమిట్టలో టీడీపీ రిలీవింగ్ ఏజెంట్లను పోలింగ్ కేంద్రంలోకి అనుమతించలేదని మంత్రికి ఫిర్యాదు చేయడంతో పోలింగ్ అధికారులతో మాట్లాడారు. దీంతో సమస్య సద్దుమణిగింది. కొత్త మాధవరంలో కూడ స్వల్ప ఘర్షణ జరిగింది.ఈ నేపధ్యంలో చాలా పోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్ జరిగిందంటూ వైసీపీ అభ్యర్థితో పాటు ఆ పార్టీ జిల్లా నేతలంతా జాతీయ రహదారిపై ఒంటిమిట్ట పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. వెంటనే పోలీసులు అక్కడకి చేరుకొని చెదరగొట్టారు. ఈ సంధర్భంగా ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి వెంకటసుబ్బారెడ్డి రీపోలింగ్ జరగకపోతే తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. వెంటనే పోలీసులు రంగప్రవేశం చేసి అందరిని పంపించి వేశారు. పోలింగ్ సంధర్భంగా ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, పలువురు డీఎస్పీలు, సీఐలు పరిస్థితిని సమీక్షించారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు మంత్రి వెంటే వెళ్లి పోలింగ్ సరళిని తెలుసుకున్నారు. మొత్తానికి ఎన్నడూ లేని విధంగా 5, 6 పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణ వాతావరణం నెలకొంది. వైసీపీ నేతలు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యేలతో కలిసి పోలింగ్ కేంద్రాల వద్దకు రావడం కూడ ఘర్షణ వాతావరణానికి కారణంగా మారింది. ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం ప్రయత్నించారు. టిడిపి అక్రమాలకు పాల్పడిందని వైసీపీ నేతలు ఆరోపించగా వైకాపా కవ్వింపు చర్యల వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని మంత్రి రాం ప్రసాద్‌రెడ్డి ధీటుగా సమాధానం ఇచ్చారు. మండలంలో 79.33శాతం పోలింగ్ నమోదైంది. 24606 ఓట్లకు 19వేల 542 ఓట్లు పోలయ్యాయి.

## అంతర్ జిల్లాల డిస్కస్ త్రో పోటీల్లో ప్రధమ బహుమతి

రాజంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:

ఏపి అథ్లెటిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర జూనియర్ అంతర్ జిల్లాల ఛాంపియన్ షిప్ పోటీల్లో రాజంపేట బాలిక ఎస్.బి అయేషా ప్రధమ స్థానంలో నిలిచింది. ఈ నెల 9 నుంచి 11వరకు జరిగిన పోటీల్లో ఆయేషా అండర్-18 విభాగంలో ప్రధమ బహుమతి సాధించినట్లు గీతాంజలి జూనియర్ కళాశాల చైర్మెన్ ఎస్‌వి రమణ తెలిపారు. వచ్చే నెలలో జరగనున్న జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో కూడ రాష్ట్రం తరపున ఆడేందుకు ఆయేషా ఎంపికైనట్లు తెలిపారు. ఈ సంధర్భంగా కళాశాలలో ఏర్పాటుచేసిన సమావేశంలో చైర్మెన్ ఎస్‌వి రమణ ఆయేషాను సన్మానించారు.

## రాజంపేటలో ఎన్‌ఎంయూ ధర్నా

రాజంపేట, ఆగస్టు 12, ప్రభాతవార్త:

రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాజంపేట ఆర్టీసి డిపోలో నేషనల్ మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ పరంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర వ్యాప్త 2రోజుల ఆందోళనలో భాగంగా మొదటి రోజు డిపో గ్యారేజ్ వద్ద ఏపీ జేఏసీ రాజంపేట తాలుకా చైర్మెన్ ఎస్వీ రమణ ఆధ్వర్యంలో యూనియర్ నేతలు ధర్నా నిర్వహించారు. వెంటనే పీఆర్సీ కమీషన్ ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ పేట-2 డిపో స్థలాన్ని లూలూ సంస్థకు ఇచ్చిన జీవోను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 4సంవత్సరాలుగా ఆగిపోయిన ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## పులివెందులలో తీవ్ర ఉద్రిక్తత

**ఎం.పి వై.ఎస్ అవినాష్ రెడ్డి ,ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి అరెస్ట్ చేసి కడపకు తరలింపు**

పులివెందుల , ఆగస్ట్ 12, ప్రభాత వార్త:



ఎంపీ తో మాట్లాడుతున్న డీఐజీ

జడ్పీటీసీ ఉప ఎన్నికల పోలింగ్ తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. ఈ ఎన్నికను తెలుగుదేశం, వై.ఎస్. ఆర్.సి.పిలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. దీంతో పులివెందుల జడ్.పి.టి.సి ఎన్నిక పోలింగ్ టెన్షన్... టెన్షన్ గా మారింది. మంగళవారం ఉదయం తెల్లవారుజామున కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డిని, టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డిని పోలీస్ లు అరెస్టు చేసి కడపకు తరలించారు. తర్వాత ఎంపీ మధ్యాహ్నం కల్లా పోలీసులు కన్ను కప్పి పులివెందులకు చేరుకున్నారు.సాయంత్రం ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి తన నివాసానికి చేరుకున్నారు. పులివెందులకు వచ్చిన ఎంపీ అవినాష్ రెడ్డి పట్టణంలోని వైసిపి పార్టీ కార్యాలయానికి వచ్చాడని విషయం తెలుసుకున్న కర్నూల్ డిఐజి కోయ ప్రవీణ్, ఎస్పీ అశోక్ కుమార్ భారీ పోలీసు బలగాలతో వైకాపా కార్యాలను చేరుకుని ఎంపీని పోలీస్ స్టేషన్ వచ్చి సంతకం పెట్టాలని కోరారు. అందుకు ఎంపీ సాయంత్రం ఐదు గంటలకు పోలీస్ స్టేషన్ కి వస్తానని అంగీకరించడంతో వారు డిఎస్పీ కార్యాలయానికి వెను తిరిగారు.

### ఎక్స్ ట్రాలు చేస్తే కాల్చి పడేస్తా

పులివెందుల డి.ఎస్పీ మురళీ నాయక్ ఎక్స్ ట్రాలు చేస్తే కాల్చి పడేస్తానంటూ వై.ఎస్.ఆర్.సి.పి కార్యకర్తలకు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పోలీసులు ఎం.పి వై.ఎస్ అవినాష్ రెడ్డిని ఉదయం హౌస్ అరెస్టు చేసిన తర్వాత ఎర్రగుంట్ల మండలం నిడిల్లా వద్ద పోలీసుల కళ్ళు కప్పి ఆయన పులివెందులకు చేరుకొని తన కార్యాలయంలో వున్న విషయాన్ని తెలుసుకుని కర్నూలు రేంజ్ డి.ఐ.జి కోయ ప్రవీణ్ అవినాష్ రెడ్డిని కలిశారు. భద్రతా కారణాల దృష్ట్యా వై.సి.పి కార్యకర్తలను ఆఫీసు ఖాళీ చేయాలంటూ డి.ఐ.జి ఆదేశించారు. దీంతో అగ్రహం వ్యక్తం చేసిన కార్యకర్తలు పోలీసులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడే వున్న పులివెందుల డి.ఎస్పీ మురళి నాయక్ వై.సి.పి కార్యకర్తల పై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. మీరు వై.సి.పి కార్యకర్తలైతే తాగి మాట్లాడితే ఒప్పుకునేది లేదు తనది ఖాకీ యూనిఫామ్ అని, ఎక్స్ ట్రాలు చేస్తే కాల్చి పడేస్తానంటూ మాస్ వార్నింగ్ ఇచ్చారు.

### ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి : డీఐజీ కోయా ప్రవీణ్

జడ్పీటీసీ ఉపఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించడం జరిగిందని డీఐజీ కోయ ప్రవీణ్ తెలిపారు. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాలు పరిశీలించడం జరిగిందని ఎక్కడ ఎటువంటి సంఘటన జరగకుండా ఎన్నికలు నిర్వహించామన్నారు. కనంపల్లెలో 20 మంది మహిళలను దగ్గరుండి ఓటు వేయడానికి పంపించడం జరిగిందన్నారు. రిగ్గింగ్ జరిగినట్లు ఆధారాలు ఇస్తే చర్యలు తీసుకుంటామన్నారు.





## జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా రెండవసారి ఎన్నికైన టిఎల్ వెంకటేష్

పీలేరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



అన్నమయ్య జిల్లా సిపిఐ రెండవ మహాసభలు మదనపల్లి పట్టణంలో అంగరంగ వైభవంగా జరిగాయి ప్రతినిధుల సమావేశంలో జిల్లా నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది అందులో పీలేరు నియోజకవర్గ కార్యదర్శి టిఎల్ వెంకటేష్ ను జిల్లా కార్యవర్గ సభ్యుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా టిఎల్ వెంకటేష్ మాట్లాడుతూ ఈమధ్య కాలంలో జిల్లాలో ప్రజా సమస్యల పైన అలుపెరగని పోరాటాలు చేశానని అందుకు గుర్తించిన రాష్ట్ర నాయకత్వం రెండవసారి కార్యవర్గ సభ్యుడుగా ఎన్నుకోవడం జరిగిందన్నారు

## పీఆర్సీ కమీషన్ వెంటనే విడుదల చేయాలి



జమ్మలమడుగు, ఆగస్టు 12, ప్రభాతవార్త:

ఎన్ఎంయూఏ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు జమ్మలమడుగు డిపో ప్రెసిడెంట్ పి.బ్రహ్మం ఆధ్వర్యంలో గేట్ ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కడప రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ పాల్గొని ఉద్యోగులకు తక్షణమే పీఆర్సీ కమీషన్‌ను ఏర్పాటు చేయాలని వేతన సవరణ 2 సంవత్సరాలు పూర్తయినందున వెంటనే ఐఆర్ ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే చెల్లించాలని రిటైర్డ్ ఉద్యోగులకు మరియు టెర్మినల్ ఎన్కాష్‌మెంట్ చెల్లింపులు తక్షణమే చేసి ఖాళీగా ఉన్న 8వేల పోస్టులను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేయాలన్నారు. అలాగే ప్రమోషన్లు వెంటనే కల్పించాలన్నారు. గ్యారేజీ ఉద్యోగస్తుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవు మంజూరు చేయాలని కోరారు. ఈహెచ్ఎస్ స్థానంలో పాత వవైద్య విధానాన్ని పునరుద్ధరించాలని ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం లేదా సంస్థ ద్వారా కొనుగోలు చేయాలని తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలను కేటాయించాలన్నారు. ఏపీఎస్ ఆర్టీసీలో ఎక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే క్యాడర్ స్ట్రెంత్‌లో ఉండే విధంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిటీ మెంబర్ ఎస్ఎం వలీ, రీజనల్ కమిటీ మెంబర్ మోహన్‌రెడ్డి, పీఎస్ వాసులు, డిపో కార్యదర్శి కె.శివుడు, అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

## పులివెందుల ఓటర్లకు 40 సంవత్సరాల తరువాత స్వాతంత్ర్యం

జమ్మలమడుగు, ఆగస్టు 12, ప్రభాతవార్త:



గత 40 సంవత్సరాలుగా పులివెందుల మండల ఓటర్లకు మంగళవారం స్వాతంత్ర్యం వచ్చిందని టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బిర్రు గుర్రప్ప అలియాస్ సంతోష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1984లో పులివెందుల మండల ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వేశారు. అప్పుడు టీడీపీ ఎంపీ డీఎన్‌రెడ్డి గెలిచారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు 40 సంవత్సరాలు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్.అవినాష్‌రెడ్డి నాయకత్వంలో పులివెందుల మండల ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకోకుండా దౌర్జన్యం చేసి రిగ్గింగ్ చేయడం ద్వారా గెలుస్తూ వచ్చారన్నారు. పులివెందుల మండల ఓటర్లకు ఎవరి ఓటు వారు వేసే స్వేచ్ఛ నేడు వచ్చిందన్నారు. పులివెందుల ఎన్డీఏ కూటమి జడ్పీటీసీ అభ్యర్థి మారెడ్డి లతారెడ్డి భారీ మెజార్టీతో గెలవబోతున్నారని ఆయన పేర్కొన్నారు.

## అరెస్టును అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యేసుధీర్ రెడ్డి

యర్రగుంట్ల ఆగస్టు 12 ప్రభాతవార్త



పులివెందుల జడ్పిటిసి ఎన్నికల లో భాగంగా తెల్లవారుజామున ఎంపీ అవినాష్ రెడ్డిని అరెస్టు చేసి ఎర్రగుంట్ల మీదుగా తరలిస్తున్నారు అన్న విషయం తెలుసుకున్న వైసిపి జమ్మలమడుగు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కార్యకర్తలతో చేరుకొని అడ్డుకున్నారు. ఎంపీ అవినాష్ రెడ్డిని దించాలని పట్టుబట్టారు. అనంతరం పోలీసులు ఎంపీ అవినాష్ రెడ్డి ని, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని తన నివాస గృహం కి తరలించారు.

## కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్‌ని తొలగించాలి.



ఎడ్యుకేషన్ ఆగస్టు 12 ప్రభాతవార్త :

కడప జిల్లా కొండాపురం మండలం ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఇంచార్జి ప్రిన్సిపాల్‌ని తొలగించి రెగ్యులర్ ప్రిన్సిపల్‌ను నియమించాలని కోరుతూ పిఎస్‌యు ఏఐఎస్‌బిపిడిఎస్‌యు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆర్జెడి డాక్టర్ సురేష్ బాబుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి సంఘం నాయకులు సుబ్బరాయుడు జయవర్ధన్ అంకన్న మాట్లాడుతూ ఇన్చార్జి ప్రిన్సిపల్ రెగ్యులర్గా మైలవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో జరిగిన ట్రాన్స్ఫర్స్‌లో కొండాపురం జూనియర్ కళాశాలలో ఎకనామిక్స్ లెక్చరర్ ఉన్నట్లు తప్పుడు సమాచారం అందించే కౌన్సిలింగ్ పూర్తయిన తర్వాత అక్కడ ఇన్చార్జి ప్రిన్సిపల్‌గా వెళ్లడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల అసోసియేషన్ అధ్యక్షులుగా వుంటూ అసోసియేషన్ వ్యవస్థ లోని కొంతమందిని కోటరీగా ఏర్పాటు చేసుకొని తనకు ఇష్టమొచ్చినట్లు వ్యవహరిస్తున్నారని తెలిపారు. జూనియర్ కళాశాలకు రెగ్యులర్ ప్రిన్సిపాల్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఈ విషయాలపైన విద్యాశాఖ మంత్రి, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు గోపి రాజేంద్ర సురేంద్ర కార్తీక్త, మహేష్, కార్తీక్, సుబ్రహ్మణ్యం, అనిల్, రమణ పాల్గొన్నారు.

## నవోదయకు ఇరువురు విద్యార్థులు ఎంపిక

చాపాడు. ఆగస్టు 12. ప్రభాతవార్త :

మండలంలోని ఇరువురు విద్యార్థులు నవోదయ పాఠశాలకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖ అధికారి రవిశంకర్ తెలిపారు. వివరాలలోకెళితే స్థానిక గాయత్రి ఇంగ్లీష్ మీడియం పాఠశాలవిద్యార్థి దేవగుడి షణ్ముఖవిగ్నేష్ రెడ్డి రెడ్డితోపాటు, వి, రాజుపాలెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న బాలటబిగాళ్ళఅక్షయ కుమార్ నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో పాటు 202526 వ సంవత్సరం ఆరవ తరగతికి అడ్మిషన్లు పొందినట్లు ఆయన తెలిపారు. నవోదయ పాఠశాలకు ఎంపిక కావడంతో పాఠశాలల యాజమాన్యం, తల్లిదండ్రులు హర్షం వ్యక్తంచేశారు.

## సొసైటీ చైర్మన్‌గా మల్లు గోపాల్ రెడ్డి నియామకం

యర్రగుంట్ల ఆగస్టు 12 ప్రభాతవార్త

ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన సీనియర్ పార్టీ నాయకుడు మల్లు గోపాల్ రెడ్డిని సున్నపరాలపల్లె సొసైటీ చైర్మన్ గా నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సున్నపురాళ్లపల్లె సొసైటీ చైర్మన్ గా నియామకమైన మల్లు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధి కోసం, వారి సంక్షేమ కోసం కృషి చేస్తానన్నారు.

## ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడం అన్యాయం

పీలేరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:



ఓటర్ల జాబితాలో అవకతవకలు, అక్రమాలపై కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ప్రశ్నలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాలని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల.అమృత్ తేజ మంగళవారం పీలేరులో మీడియా ముఖంగా డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జరిగిన ఓట్ల అక్రమాలతో 70 స్థానాల్లో ఫలితాలు మారినట్లు తేటతెల్లమైందన్నారు. దీనిపై సుప్రీంకోర్టు సుమోటాగా తీసుకొని విచారణ జరపాలని కోరారు. బీహార్ ఎన్నికల్లోను జరగనున్న అక్రమాలను ముందే కాంగ్రెస్ వెల్లడించిందని, దీనిపై కోర్టులు మొట్టికాయలు వేసిన ఈసీ స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఇటివల ఎలక్షన్ కమిషన్ కార్యాలయానికి వెళ్తున్న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ సహా ఇండియా కూటమి నేతలను అరెస్టు చేయడంతో ప్రజాస్వామ్యం కూని అయిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రి పదవి పొంది ఇటీవల రాహుల్ గాంధీ మరియు కాంగ్రెస్ పార్టీ పై ఆయన చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి నాయకులు లేరన్న ఆయన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్ పార్టీలో ముఖ్యమంత్రిగా మంత్రులుగా చేసిన వ్యక్తులు పార్టీని వదిలేసి వెళ్లిపోయిన సామాన్య కార్యకర్తలు నేటికీ కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని తెలిపారు. రాహుల్ గాంధీ కుటుంబానికి పదవులు వారసత్వంగా రాలేదని కేవలం ప్రాణత్యాగాలు వారసత్వంగా వచ్చాయని తెలిపారు. అలాంటి కుటుంబాన్ని దేశద్రోహులుగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతోంది అని తెలిపారు. రాహుల్ గాంధీ రాజ్యాధికారం కోసం పోరాటం చేయడం లేదని, ఆయన చేస్తున్న పోరాటం ప్రజాస్వామ పరిరక్షణ కోసమే అని తెలిపారు. ఎలక్షన్ కమిషన్ పై ఆయన చేస్తున్న పోరాటానికి పార్టీలకతీతంగా మద్దతుగా నిలుస్తున్న ప్రతి ఒక్క పౌరుడికి ఈ సందర్భంగా అమృత్ తేజ ధన్యవాదాలు తెలియజేశారు.

## సజ్జల రామకృష్ణా రెడ్డిని వేంపల్లి బావాజీ

పీలేరు ఆగస్టు 12 ప్రభాతవార్త:



మాజీ ప్రభుత్వ సలహాదారులు సజ్జల రామకృష్ణా రెడ్డి ని పీలేరు నియోజకవర్గం, కలికిరి మండల యువ నాయకులు, వైఎస్ఆర్సీపీ మండల ఉపాధ్యక్షుడు వేంపల్లి బావాజీ తాడేపల్లి వైఎస్ఆర్సీపీ పార్టీ కార్యాలయంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణ రెడ్డి పీలేరు నియోజక వర్గం, కలికిరి మండల రాజకీయ పరిస్థితులను గురించి ఆరా తీశారు. నియోజకవర్గం లో పార్టీ కార్యక్రమాలు ఏ విధంగా జరుగుతున్నాయని తెలుసుకున్నారు. మండల స్థాయి, నియోజక వర్గ స్థాయిలో చేస్తున్న పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉన్నారని, అదే విధంగా కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళడంలో పనితీరు బాగుందని వేంపల్లి బావాజీ ని అభినందించారు. మండల స్థాయిలో, నియోజకవర్గ స్థాయిలో యువతను ముందుకు తీసుకువెళుతూ వైఎస్ఆర్సీపీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వేంపల్లి బావాజీ మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గ, కలికిరి మండల రాజకీయాలను వివరించారు.

## స్వాతంత్రవేడుకల్లో మాజీ సైనికులు పాల్గొనాలి

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 12 ప్రభాతవార్త:

ఈ నెల 15వ తేదీన ఉదయం 07.30 గంటల నుంచి 11.00 గంటల వరకు స్థానిక అనిబిసెంటు మున్సిపల్ హైస్కూలు మైదానంలో డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ ద్వారా స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు మరియు జాతీయ జెండా వందనం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డిఫెన్స్ ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ప్రొద్దుటూరు డివిజన్ ప్రెసిడెంట్ నేట్ల బాల వీరారెడ్డి తెలిపారు. అలాగే గాంధీ రోడ్ లో మహాత్మా గాంధీ విగ్రహం గాంధీ విగ్రహం మరియు టి బి రోడ్ లో సుభాశ్ చంద్ర భోస్ విగ్రహానికి నివాళులు అర్పించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమానికి సైనికులు, మాజీ సైనికులు మరియు వీర నారీ మణులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు.

## పారిశుద్ధ్య వ్యవస్థను పర్యవేక్షించిన కమిషనర్



ప్రొద్దుటూరు ఆగస్టు 12 ప్రభాతవార్త

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలో అధిక వర్షపాతం వల్ల పట్టణంలో సోమవారం మున్సిపల్ కమిషనర్ రవిచంద్రా రెడ్డి పర్యటించి పారిశుద్ధ్య వ్యవస్థను పర్యవేక్షించారు. స్థానిక బాలాజీ నగర్ లోని ప్రజల సమస్యలు తెలుసుకుని ఆ ప్రాంతంలో పర్యటించి ఎప్పటికప్పుడు చెత్తను తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. అలాగే అర్చన హాల్ వద్ద ఉన్న నడువు చానల్ అందు పేరుకుపోయిన చిత్ర తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు గాంధీ రోడ్ లోని రోటరీ హాస్పిటల్ వారు తెలిపిన సమస్యను పరిష్కరించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ డి కొండయ్య మరియు సానిటరీ ఇన్స్పెక్టర్ నూర్ భాషా పాల్గొన్నారు.

## రాష్ట్ర సంక్షేమం మరియు అభివృద్ధి సంఘం చైర్మన్‌గా చంద్రశేఖర్

కలికిరి, ఆగస్టు 12, ప్రభాతవార్త:



ఏపీ రాష్ట్ర జంగం సంక్షేమం మరియు అభివృద్ధి సంఘం ఛైర్మన్‌గా పీలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి ముఖ్య అనుచరుడైన పత్తేగడ పంచాయతీ కోటాలకు చెందిన వాసనూరి చంద్రశేఖర్‌ను నియమిస్తూ సీఎం నారా చంద్రబాబునాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. వాసనూరి చంద్రశేఖర్ తండ్రి వాసనూరి రెడ్డయ్య నల్లారి కుటుంబానికి వీరవిధేయులు. పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తండ్రి నల్లారి అమర్‌నాథ్‌రెడ్డికి ప్రథమ అనురుచుడిగా ఉంటూ వాసనూరి రెడ్డయ్య నల్లారి కుటుంబం విజయానికి కృషి చేస్తూ వచ్చారు. ఆయన సేవలను గుర్తించి సీఎం చంద్రబాబునాయుడు పీలేరు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి కోరిక మేరకు వాసనూరి చంద్రశేఖర్‌ను రాష్ట్ర జంగం సంక్షేమం మరియు అభివృద్ధి సంఘం ఛైర్మన్‌గా నియమించడం జరిగింది. ఏపీ రాష్ట్ర జంగం సంక్షేమ సంఘం మరియు అభివృద్ధి ఛైర్మన్‌గా పదవి చేపట్టిన చంద్రశేఖర్‌కు మర్రికుంటపల్లె పంచాయతీ సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, తెదేపా నాయకులు అభినందనలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు.

## నులిపురుగులను నిర్మూలించండి..

సుండుపల్లి, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని అన్ని అంగన్వాడి కేంద్రాలు, ప్రాథమిక పాఠశాలలు, హైస్కూలు, కాలేజీల నందు 12వ తేదీ మంగళవారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా 1 సంవత్సరం నుండి 19 సంవత్సరాల లోపు పిల్లలకు నులి పురుగులు రాకుండా ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరిగిందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దిలీప్ గుప్తా తెలియజేశారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన డాక్టర్లకు, ఉపాధ్యాయులకు, నర్సులకు, అంగన్వాడీ వర్కర్లకు, ఆశా వర్కర్లకు ధన్యవాదాలు తెలియజేశారు.



## జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అవగాహన




పెద్దమండెం ఆగస్టు 12 ప్రభాతవార్త

జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా నులిపురుగుల నివారణ పడాక్టర్ అశోక్ చైతన్య రవి వర్మలు పాఠశాలవిద్యార్థులకు అవగాహన కల్పించారు మండలంలోని 7 వేల ఎనిమిది మంది విద్యార్థులకు గాను 6,868 మంది విద్యార్థులకు నులిపురుగుల మందు అల్బాండోచ్ మాత్రలను మింగించారు దీని ద్వార విద్యార్థుల కడుపులో ఉన్న నులిపురుగులను నివారించడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ చర్యలు చేపడుతుందని అన్నారు కావున ప్రతి విద్యార్థి నుదుపురుగుల మాత్రలను మింగాల్సిన అవసరం ఉందని అన్నారు అనంతరం తప్పిపోయిన విద్యార్థులకు ఈనెల 20వ తేదీన మాసబ్ డే రోజున అందిస్తామని తెలిపారు విద్యార్థుల ఆరోగ్యమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతి సంవత్సరం ఈ రోజున ఈ మాత్రలను ప్రతి ఒక్క విద్యార్థికి అందించడం జరుగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ మురళి దర్ సూపర్వైజర్ రమణమ్మ ఎం ఎల్ హెచ ఎస్ ఏఎన్ఎంలు అంగన్వాడి కార్యకర్తలు ఆశా వర్కర్లు ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## కలికిరి విస్తరణాధికారిగా యువకిశోర్

కలికిరి, ఆగస్టు 12, ప్రభాతవార్త:



మండల వ్యవసాయశాఖ విస్తరణాధికారిగా యువ కిశోర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. గతంలో ఆర్ఎస్‌కేలో వ్యవసాయ సహాయకుడిగా యువకిశోర్ విధులు నిర్వహించాడు. ప్రస్తుతం వాల్మీకిపురం మండలం గండబోయినపల్లి పంచాయతీ ఆర్ఎస్‌కే కేంద్రంలో వ్యవసాయ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. అతనికి ప్రభుత్వం వ్యవసాయ శాఖ విస్తరణాధికారిగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆయన కలికిరి మండలం వ్యవసాయశాఖ విస్తరణాధికారిగా బాధ్యతలు చేపట్టనున్నారు.

## ఒంటిమిట్ట మండలంలో ఎన్నికల ప్రశాంతం



ఒంటిమిట్ట .ఆగస్టు. 12(ప్రభాతవార్త)

ఒంటిమిట్ట జడ్పిటిసి ఉపఎన్నికకు బుధవారం అధికారులు మండలంలోని 13 పంచాయతీల్లో ఓటింగ్ నిర్వహించడం జరిగింది.77.3 శాతం ఓటింగ్ పోలైనట్లు మండల ప్రజలు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నట్లు ఎన్నికల అధికారులు తెలియజేశారు.మండలంలోని ప్రజలు స్వచ్ఛందంగా ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడం జరిగింది. పోలింగ్ బూతుల వద్ద రక్షకబటులు సంపూర్ణ బాధ్యతలు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది. మండలానికి చెందిన చింతరాజు పల్లి ,సాలాబాధ, చిన్న కొత్తపల్లె, మండల కేంద్రం ఒంటిమిట్ట, మంటపంపల్లి పంచాయతీలలో వైసిపి ,టిడిపి నాయకులు కార్యకర్తలు ఘర్షణలకు దిగడం జరిగింది. ఆ సమయంలో పోలీసులు ఘర్షణలను అరికట్టడం జరిగింది. సంపూర్ణంగా శాంతి భద్రత కల్పించారు. ముఖ్యమైన పోలింగ్ బూతుల వద్ద మంత్రి రాంప్రసాద్ రెడ్డి తన అనుచరులతో పర్యవేక్షించడం జరిగింది. ఏది ఏమైనప్పటికీ పలు పంచాయతీలలో చిన్న చిన్న ఘర్షణలు జరిగినప్పటికీ జడ్పిటిసి ఉప ఎన్నిక పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని చెప్పాలి.

## నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం..

బ్రహ్మంగారిమఠం ఆగస్టు. 12(ప్రభాతవార్త)

శ్రీ వీరబ్రహ్మేంద్ర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో కళాశాల కరస్పాండెంట్ డియల్ రవీంద్రారెడ్డి మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ కే వల్లి ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపల్ ముండ్లపాటి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టారు ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థి విద్యార్థులకు నులిపురుగుల నిర్మూలన కొరకై స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది చేత నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ వారిచే మ్రింగించారు ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ముడియం గురు స్వప్న మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రలను ప్రతి ఒక్కరు తప్పనిసరిగా తీసుకోవాలని నులిపురుగుల ద్వారా వ్యక్తులలో ఎదుగుదలలో ఆటంకం ఏర్పడడం అధిక రక్తహీనత ఆకలి మందగించడం శరీరం నీరసం ఆందోళన కలగడం అధిక విరోచనాలు వాంతులు కావడం జరుగుతుందని సరైన అభివృద్ధి జరగదని ఇవి రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని చేతులు గోళ్లను శుభ్రం చేసుకోవడం స్వచ్ఛమైన శుభ్రంగా ఉన్న మంచినీటిని సేవించడం శుభ్రంగా ఉన్న ఆహారం సేవించడం ఆహారాన్ని ఎప్పుడు కప్పి ఉంచడం కూరగాయలను ఆకుకూరలను శుభ్రమైన నీటితో శుభ్రం చేసి వాడడం మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం బయట ప్రదేశాల్లో తిరిగే సమయంలో పాదాలకు సురక్షితమైనటువంటి చెప్పులను వేసుకోవడం చేయాలన్నారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయలక్ష్మి ,నరసమ్మ, కళాశాల అధ్యాపకులు బాలసుబ్బయ్య శారద, వీరలక్ష్మి విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు



## సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి ఆకస్మిక పర్యటన

పెద్దమండెం ఆగస్టు 12 ప్రభాతవార్త



సోమవారం సబ్ కలెక్టర్ బాధ్యతలు చేపట్టిన చల్లా కళ్యాణి మంగళవారం పెద్ద మండలంలో ఆకస్మికంగా పర్యటించారు ముందుగా తాసిల్దార కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు మండలంలో సమస్యలపై తహసిల్దార్ తేజస్వితో మాట్లాడుతూ గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు ఈ సర్వే ఎలా జరుగుతుంది భూ సమస్యలపై ఏమైనా ఫిర్యాదులు వచ్చాయా అని ఆరా తీశారు సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించడం జరుగుతుందని తాసిల్దార్ తెలిపారు అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించారు అక్కడ రోగులపై ఆరా తీశారు వివిధ రోగాలపై మందులు సకాలంలో అందుతున్నాయా రోగులు ప్రతిరోజు ఎంతమంది వస్తున్నారు వాటి వివరాలు వివిధ రోగాలపై ఆరా తీశారు అనంతరం మోడల్ స్కూల్లో పరిశీలించే అక్కడి పరిస్థితులను మధ్యాహ్న భోజన పథకం గురించి అలాగే హాస్టల్ విద్యార్థుల కు సమస్యలపై అడిగి తెలుసుకున్నారు వంటకాలు బాగున్నాయా రుచికరంగా ఉన్నాయా అని ప్రశ్నించారు అనంతరం విద్యార్థుల ఇంటలిజెంట్ ఎవరు ఎన్ని మార్కులు వచ్చాయి 95 పైన మార్పులు వచ్చిన వారి వివరాలను గురించి అడిగారు భవిష్యత్తులో మీరు ఏమి కావాలని అనుకుంటున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు కొంతమంది డాక్టర్లుగా కొంతమంది ఐఏఎస్లుగా ఐపీఎస్లుగా అవుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిటి సురేష్ ఆర్ ఐ భరత్ పీహెచ్సీ డాక్టర్ అశోక్ చైతన్య రవి వర్మ సిహెచ్ఓ మురళి మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రామానుజన్ నాయక్ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## బద్వేల్ ను కడప జిల్లాలోనే కొన సాగించాలి

బద్వేల్ అర్బన్ ఆగస్టు 12 ప్రభాతవార్త :



బద్వేల్ నియోజకవర్గాన్ని రాజంపేట జిల్లాలో కలపాలనే ప్రభుత్వ ఆలోచనను వెంటనే విరమించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పెద్ది సుధాకర్ మాట్లాడుతూ బద్వేల్ ను రాజంపేట జిల్లాలో కలిపితే ఈ ప్రాంత ప్రజలు ఏదైనా అవసరమైన సమయంలో దాదాపు 130 కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుందన్నారు.ఇది అన్ని రకాలుగా ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులు, నష్టాలను కలిగిస్తుంది అని అన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయంపై పునరాలోచన చేసి, బద్వేల్ నియోజకవర్గం కడప జిల్లాలోనే కొనసాగించాలన్నారు.అన్ని రాజకీయ పార్టీలు కలిసికట్టుగా పోరాటం చేసి, ఈ చర్యను నిలిపివేయాలని కోరారు. గతంలో ఆర్డీవో కార్యాలయం రాజంపేటలో ఉన్నప్పుడు బద్వేలు నియోజకవర్గం నుండి రాజంపేట వెళ్లాలంటే దాదాపు 130 కిలోమీటర్ల ప్రయాణం చేయాల్సి వస్తుందని అప్పట్లో ప్రభుత్వం ఆర్డిఓ కార్యాలయాన్ని కూడా బద్వేల్ కి తరలించడం రెవిన్యూ డివిజన్ చేయడం పట్ల పలువురు రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు, కడప జిల్లాలోని బద్వేల్ కలిసే విధంగా నాయకులు చొరవ చూపాలి.

## రాహుల్ గాంధీ అరెస్టు అప్రజాస్వామికం..

వేంపల్లె ఆగష్టు 12 :(ప్రభాత వార్త)

ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణవాయువు లాంటివని, అటువంటి ఎన్నికలకు సక్రమమైన ,సమగ్రమైన ఓటర్ల జాబితా అనేది అతి ప్రధానమైన అంశమని, ఓటర్ల జాబితాలో తప్పొప్పులు ఉన్నాయని, అవకతవకలు ఉన్నాయని, వాటిని సరిదిద్దండి అని చెప్పే దానికి కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులు, లోక్‌సభ లో ప్రతిపక్ష నాయకుడు అయినటువంటి రాహుల్ గాంధీ నాయకత్వాన దాదాపు 300 మంది ఎంపీలు ఢిల్లీలో ఎన్నికల కమిషన్ ను కలవడానికి వెళ్తే ఎన్నికల కమిషన్ అపాయింట్మెంట్ ఇవ్వకపోవడమే కాకుండా రాహుల్ గాంధీని మిగతా ఎంపీలను అరెస్టు చేయడమనేది అత్యంత దుర్మార్గమైన చర్య, ఇది అప్రజా స్వామికం, పిరికిపంద చర్య అని తులసిరెడ్డి ధ్వజమెత్తారు .మంగళవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ గుమ్మడికాయల దొంగ అంటే భుజాలు తడుముకున్నట్లు ఉంది ఎలక్షన్ కమిషన్ వాలకం. తప్పులు లేకుండా పోతే ఎందుకు రాహుల్ గాంధీ ని కలవాలంటే భయపడుతున్నారని ప్రశ్నించారు.? బిజెపి అగ్రనాయకులు అద్వాని , బిజెపి నాయకులు డాక్టర్ సుబ్రమణ్య స్వామి , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ,జగన్మోహన్ రెడ్డి ,రాహుల్ గాంధీ ,మిగతా పార్టీల నాయకులు ,చివరికి సాంకేతిక నిపుణుడు,అమెరికాకు చెందిన ఎలాన్ మస్క్ కూడా ఈవీఎంలను మ్యానుపులేట్ చేయొచ్చు అని చెప్పడం జరిగిందన్నారు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ ఇప్పటికీ కూడా బ్యాలెట్ పేపర్ వాడుతున్నాయి. మరికొన్ని దేశాలైతే కొన్నాళ్ల ఈవీఎంలు వాడి వాటిలో అవకతవకలు ఉన్నాయని తెలుసుకొని మళ్లీ బ్యాలెట్ పేపర్ కు రావడం జరిగిందన్నారు. రాబోవు లోక్‌సభ ఎన్నికలు గాని, అసెంబ్లీ ఎన్నికలు గాని ఈవీఎమ్ లతో కాకుండా బ్యాలెట్ పేపర్ ద్వారా నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోందని తులసి రెడ్డి పేర్కొన్నారు...

## విద్యార్థులకు ఆల్బెండజోల్ పంపిణి..



వేంపల్లె ఆగష్టు 12:(ప్రభాత వార్త)

నులిపురుగుల నివారణ దినోత్సవ సందర్భముగా వేముల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ దక్షిణా మూర్తి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ పరిసరాల అపరిశుభ్రత, వ్యక్తిగత అపరిశుభ్రత ద్వారా మానవ దేహంలోనికి హాని కలిగించే సూక్ష్మజీవులు చేరుతాయని, తత్ఫలితంగా రోగ నిరోధక శక్తిని కోల్పోతామని తెలియజేశారు. ఈ రోగనిరోధక శక్తిని హరించే క్రిములను నివారించుటలో ఆల్బెండజోల్ పాత్ర గణనీయంగా ఉంటుందని ,కావున ప్రతి ఒక్కరు ఆల్బండ జోల మాత్రలను భోజనము తర్వాత తీసుకోవలసినదిగా ఉద్బోదించారు. విద్యార్థిని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను అందించి ఎలా వినియోగించాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సునీత, మస్తానయ్య, బాలయ్య, సుబ్బారాయుడు, భాస్కర, అంజాద్ అలీ, జగన్, సతీష్, పుల్లయ్య, కిరణ్మయి, బాబీ, నాంటీచింగ్ సిబ్బంది నాగమ్మ, స్వర్ణ లత,చిన్ని, విజయ్, తదితరులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వినూత్న సేవలకు సిహెచ్ఎస్ శ్రీకారం.

చిట్వేలి ఆగష్టు 12:(ప్రభాత వార్త)

పలు సేవా కార్యక్రమాలతో మండల ప్రజలకు సేవలందిస్తున్న చిట్వేలి హెల్ప్ లైన్ సొసైటీ (సిహెచ్ఎస్) మంగళవారం మరో వినూత్న సేవకు శ్రీకారం చుట్టింది. చిట్వేలి గ్రామ పంచాయితీ ప్రాంగణంలో ప్రజల దాహార్తిని, పేదల ఆకలిని, అవసరాలను తీర్చే విధంగా ఫుడ్ బ్యాంక్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మార్వో స్పందన మాట్లాడుతూ త్రాగు నీటి వసతి, ఆహార నిలువకు ఫ్రిడ్జ్ సదుపాయం ను సిహెచ్ఎస్ చేపట్టడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు.యువత ఇలాంటి సేవలను చేయడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సిహెచ్ఎస్ కార్యదర్శి గాడి ఇంతియాజ్, అధ్యక్షుడు మన్నూరు భాస్కర్ రెడ్డిలు మాట్లాడుతూ రక్తదాన శిబిరాలు, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు తదితర సేవలతో పాటు ప్రజల అవసరాలకు తగ్గట్టు ఎప్పటికప్పుడు సి హెచ్ ఎస్ సేవలను అందిస్తూ ఉందన్నారు. 24 గంటలు త్రాగునీటిని అందిస్తామన్నారు. విశేష కార్యక్రమాలలో మిగిలిన ఆహార పదార్థాలను దాతలు అందిస్తే వాటిని భద్రపరిచి పేదలకు పంచుతామన్నారు. అలాగే తమకు పనికిరాని పాత దుస్తులను వస్తువులను ఎవరైనా పేదల కోసం ఇవ్వవచ్చని తెలిపారు. పంచాయతీ ప్రాంగణం వద్ద ఫుడ్ బ్యాంక్ నిర్మించుకోవడానికి సహకరించిన గ్రామ ఉపసర్పంచ్ ఉమామహేశ్వర్ రెడ్డికి, కార్యదర్శి రామ సుబ్బారెడ్డి కి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ సభ్యులు గాలా శివారెడ్డి, అలిశెట్టి పెంచలయ్య, నాగిరెడ్డి తిరుమలరెడ్డి, జానీ బుక్ స్టోర్ జనార్ధన, వలసాని గుండాలయ్య,వరుణ్ కుమార్ రాజు, మానవతా సంస్థ కార్య నిర్వాహకులు సాయిరాం,ముని రావు,రంగారెడ్డి, మరియు స్థానిక సామాజిక కార్యకర్తలు నాయుని వెంకటరమణ,పెద్దంగారి సాయి,ఆకేపాటి వెంకటరెడ్డి, చౌడవరం సురేంద్ర రెడ్డి, అవినాష్, సురేష్,శ్యామ్, శివ తదితరులు పాల్గొన్నారు.


## పేరు మార్పు

బొర్రన్న గారి. వీరయ్య యాదవ్ తండ్రి బొర్రన్న గారి. వీరయ్య (పాత పేరు), డోర్ నెంబర్ :22/45-ఏ, వేపరాల గ్రామం, మైదుకూరు మండలం, కడప జిల్లా, ఏపీ, 516172, వీరు యాదవ్ బొర్రన్న గారి (కొత్త పేరు)గా మార్చుడమైనది గమనించగలరు. ఫోన్:8520036591

## Change of Name

I, SYED ABDUL KHADER S/o. Syed Mohammed Mustafa , Resident of D. No.2/1069 Near Sun Rise Hospital, Nagarajupeta, Kadapa, YSR Kadapa District, A. P. I declare that My name was mentioned in my Passport as SYED ABDUL KHADAR. But as per my Aadhar card and Educational Certificates my name was mentioned as SYED ABDUL KHADER. Hence I want to change and remain my name is as SYED ABDUL KHADER (NEW NAME) only.

## గ్రూప్-1, 2 నోటిఫికేషన్‌లను విడుదల చేయాలి

మదనపల్లె, ఆగస్టు 12 ప్రభాతవార్త :


వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గ్రూప్-1, 2 నోటిఫికేషన్‌లను విడుదల చేయాలని రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషనర్ ఛైర్మెన్ అనూరాధాకు బివైఎస్ రాష్ట్ర అధ్యక్షులు పునిత్ విన్నవించారు. మంగళవారం విజయవాడలో పబ్లిక్ సర్వీస్ కమీషన్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రూప్-1, 2 నోటిఫికేషన్‌లను తొందరగా పూర్తి చేయాలన్నారు. వాటికి సంబంధించిన తుది ఫలితాలను ప్రకటించాలని కోరారు. ఇప్పటికే మెయిన్స్ జరిగి ఐదు నెలలు కావస్తున్నా నోటిఫికేషన్ తొందరగా పూర్తి చేసి కొత్త నోటిఫికేషన్‌ను విడుదల చేయాలన్నారు. పబ్లిక్ సర్వీస్ కమీషన్ స్పందించి త్వరలోనే ఫలితాలు విడుదల చేస్తామని చెప్పడం జరిగిందన్నారు. రాబోయే పబ్లిక్ సర్వీస్ కమీషన్ నోటిఫికేషన్‌ను పక్కాగా అమలు చేయాలని కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన యువసేన నాయకులు జిలాని, రమణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సీట్లు సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మదనపల్లె, ఆగస్టు 12 ప్రభాతవార్త :

పట్టణ సమీపంలోని చంద్రాకాలనీ నందుగల అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్లను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సూచించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో 5,10వ తరగతి, ఇంటర్‌మీడియట్ ద్వితీయ సంవత్సరంలో మిగులు సీట్లును అర్హత కలిగిన విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. 5వ తరగతిలో ఎస్‌సి గ్రేడ్-2లో 3సీట్లు, ఎస్‌సిగ్రేడ్-3కి 20సీట్లు, 10వ తరగతిలో ఎస్‌సిగ్రేడ్-3కి ఏడుసీట్లు, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో ఎస్‌సిగ్రేడ్-2కు 5సీట్లు, ఎస్‌సిగ్రేడ్-3కి 2సీట్లు, ఓసికి ఒక్కసీటు ఖాళీ ఉన్నట్లు ప్రిన్సిపాల్ మల్లేశ్వరీ తెలియజేశారన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణ ప్రజలు స్వాతంత్ర్య దినోత్సవం సంబరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో టిడిపి నాయకులు శీనానాయక్, జేసిబి వేణు, నవీన్‌చౌదరి, జేసిబి మధు, షంషేర్, ఈశ్వర్‌నాయక్ పాల్గొన్నారు.

## దొంగ ఓట్ల మోడీ గద్దె దిగాలి

### వీసీకే పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్

మదనపల్లె, ఆగస్టు 12 ప్రభాతవార్త:


మాట్లాడుతున్న పిటిఎం శివప్రసాద్

దొంగ ఓట్లతో గద్దెనెక్కిన మోడీ రాజీనామా చేసి గద్దె దిగిపోవాలని, విడుదలైన చిరుతైగల్ కట్చి(వీసికే పార్టీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బాస్ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాహుల్‌గాంధీ బయటపెట్టిన ఓటన్ల దొంగతనం మీద సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జిల చేత విచారణ జరిపించాలని చెప్పారు. అంబేద్కర్ పౌరులకు ఇచ్చిన ఓటుహక్కును బిజెపి దొంగతనం చేస్తున్నదని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడానికి ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీతో పాటు 300మందికి పైగా ఎంపిలు చేసున్న పోరాటానికి మద్దతు ప్రకటించారు. దొంగ ఓట్లను సృష్టించడంలో బిజెపి, ఎలక్షన్ కమీషన్ ప్రమేయం పట్ల అనుమానాలు ఉన్నాయని, ఓట్ల కుంభకోణంలనో పాల్గొన్న అధికారులను వెంటనే అరెస్టు చేసి సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వీసీకే పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముత్యాల మోహన్, భారతీయ అంబేద్కర్ సేన నాయకులు జి.గంగులప్ప, వై.గంగాధర్, సయ్యద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

## సిఐను సన్మానించిన మాల మహానాడు నాయకులు


సీఐని సన్మానిస్తున్న హరి తదితర నాయకులు

పీలేరు ఆగస్టు 12 ప్రభాతవార్త:

నియోజకవర్గంలోని కలికిరి మండలంలో మంగళవారం కలికిరి సిఐ అనిల్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన మాల మహానాడు నాయకులు ఈ సందర్భంగా దళితుల సమస్యల గురించి దళితుల భూములు గురించి సిఐకి తెలియ చేశారు. మాల మహానాడు నాయకులు వివరంగా సమస్యలు చెప్పిన తర్వాత సిఐ స్పందించి నేను దళితులకు న్యాయం చేస్తానని చెప్పడం జరిగింది దళితులకే కాదు ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు ఎటువంటి సమస్యలు వచ్చిన తక్షణమే పరిష్కరిస్తానని తెలియజేసినారు స్పందించిన సీఐకి మాల మహానాడు తరపున మర్యాదపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి విహారి రాయలసీమ కార్యదర్శి అమలా చంద్రయ్య రాయలసీమ ఉపాధ్యక్షులు గుండా మనోహర మాల మహానాడు కార్యదర్శి మల్లీల మోహన జిల్లా అధ్యక్షులు శివయ్య ఈశ్వర్ గౌడ్ సురేష్ విజయ్ సతీష్ సహదేవయ్య చిన్న విజయ్ మొదలగున వారు పాల్గొన్నారు

## ఎయిడ్స్ నిర్మూలన పై అవగాహన ర్యాలీ.



తంబళ్లపల్లె ఆగస్టు 12 ప్రభాతవార్త ః

ఆంధ్రప్రదేశ్ హెచ్ఐవి, ఎయిడ్స్ నిర్మూలన మరియు నియంత్రణ మండలి మరియు ఐసిటిసి ఆధ్వర్యంలో కృషి సంస్థ సహకారంతో మంగళవారం మీకు తెలుసా ఐఈసిపై అవగాహన ర్యాలీ జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీవో థామస్ రాజా లాంఛనంగా మీకు తెలుసా పోస్టర్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసిటిసి కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్ టి బాలాజీ, వెలుగు సీసీలు రమణ, నరసింహులు, కృషి సంస్థ మేనేజర్ శ్రీనివాసులు సిబ్బంది ఓఆర్‌డబ్ల్యుఎస్ సావిత్రి, పల్లవి, పిఈ శోభ పాల్గొన్నారు.

## ఆటో బోల్తా పడి వృద్ధురాలు మృతి

మదనపల్లెక్రైమ్, ఆగస్టు 12 ప్రభాతవార్త.

ఆటో బోల్తా పడటంతో వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె మండలంలో జరిగింది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. బొమ్మనచెరువు పంచాయతీ, టేకులపాళ్యం సమీపంలోని పందివానిపల్లికి చెందిన లేట్ వెంకటరమణ భార్య చిన్న పాపమ్మ (70) బొమ్మనుచెరువు సచివాలయం వెళ్లేందుకు ఆటో ఎక్కింది. మార్గమధ్యంలోని మందబండ వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో చిన్నపాపమ్మ డ్రైవర్ రామిరెడ్డి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితులను 108 లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్న పాపమ్మ మృతి చెందినట్లు తెలిపారు. గాయపడిన రామిరెడ్డిని ఆసుపత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## డిప్యూటీ తాసిల్దారుగా సిద్దేశ్వర రావు

ఓబులవారిపల్లి ఆగస్టు 12 ప్రభాతవార్త



ఓబులవారిపల్లి మండల తాసిల్దారుగా సిద్దేశ్వర రావు మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో రాజంపేట అన్నమయ్య జిల్లాలలో కలెక్టరేట్ మరియు సబ్ కలెక్టర్ కార్యాలయాలలో డిప్యూటీ తాసిల్దార్ సీనియర్ గా బాధ్యతలు నిర్వహించారని తెలుస్తోంది రతనెల క్రితం ఓబులవారిపల్లి బదిలీ కాగా అదనపు బాధ్యతలు చేపట్టడంతో పై అధికారులు ఆదేశాల మేరకు ఆ పనులను పూర్తి చేసి ఓబులవారిపల్లి బదిలీ అయినట్లు ఆయన తెలిపారు వీధి నిర్వహణలో వీఆర్వోలకు సహకరించని వీఆర్ఏల పై చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాలలో అధికారులు చెప్పినట్లు వారి పనులు చేసి ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు అసిస్టెంట్ సాయి ఆర్ఐ మల్లికార్జున వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు

## పప్పు ధాన్యాల సాగు లాభదాయకం




రామాపురం ఆగస్టు12. ప్రభాతవార్త

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రామాపురం మండలం హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లి గ్రామంలో రైతు నాగేంద్ర రెడ్డికి 10 ఎకరాలలో పప్పు ధాన్యాల సాగు చేయించడం జరిగింది ముఖ్యంగా కంది ప్రధాన పంట చేసుకొని వీటితో పాటు 5 ప్రధాన పంటలు వేయడం జరిగింది అనప అలసంద పెసర్లు ఉద్దులు, ఆముదం వేయడం జరిగింది. జీవవైవిధ్యా పంటలు 5 శాతం వేయడం జరిగింది. బద్దార్ క్రాప్ గా జొన్న, మొక్కజొన్న, సజ్జలు వేయడం జరిగింది. మాస్టర్ ట్రైనర్ మధుకర్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమం చేపట్టడం జరిగింది. రైతులు ప్రతి ఒక్కరు వర్షదారం క్రింద పంటలు వేసుకొంటే ఖర్చు తగ్గుతుంది. ఆదాయం వస్తుంది. అదేవిదంగా ఆరోగ్యం కాపాడు కోవచ్చు అని తెలిపారు. ఏ ఓ నాగమణి గారు మాట్లాడుతూ ఏవిధనం వల్ల భూమిని 365 రోజులు కప్పి ఉంచుతుంది. వానపాములు, సూక్ష్మ జీవులు అభిరుద్ధి చెందుతాయని, రైతులు కు ఆదాయం వస్తుంది అని తెలిపారు. ఎన్ యఫ్ ఏ యశోద గారు మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు ఏవిదంగా విభిన్న పంటలు వేసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయని తెలిపారు. ఈకార్యక్రమంలో సి ఆర్ పి లు వెంకటరామిరెడ్డి, సుధాకర్, కదిరిన్నిషా, రెడ్డెమ్మ, హరి, మోడల్ మేకర్ సదాశివారెడ్డి, మార్కెటింగ్ ఎం టీ రవీంద్ర గౌడ్, ఐ సి ఆర్ పి లు, vaa, vha లు రైతులు పాల్గొన్నారు.

## ఒక మాత్రతో నులిపురుగులను నివారిద్దాం



బద్వేల్ ఆగస్టు12. ప్రభాతవార్త

మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల మరియు తిరువెంగళపురం ఉన్నత పాఠశాల పర్యవేక్షణలో భాగంగా అన్ని ప్రభుత్వ,ప్రైవేట్, అంగన్వాడి సెంటర్ నందు జాతీయ నులిపురుగుల దినోత్సవం జరపడమైనది ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ మాట్లాడుతూ మానవ శరీరంలో ఈ నులిపురుగులు ఉండటం వలన ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులకు రక్తహీనత, నీరసంగా ఉండటము తల తిరగడము కడుపునొప్పి రాడము మొదలుకు లక్షణాలు ఉండటం వలన విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యాంశాలు సరైన అర్థం చేసుకోకపోవడం జరుగును కావున ఈ నులిపురుగుల నివారణ కోసం కేంద్ర ప్రభుత్వము రాష్ట్ర ప్రభుత్వము సంయుక్తముగా ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఈ ప్రోగ్రామ్ను నిర్వహించబడునని పేర్కొనడమైనది, ప్రతి విద్యార్థినీ విద్యార్థులకు ఆరు నెలలకు ఒకసారి నులుపులను నివారణ కోసము ఆల్బెండజోల్ మాత్రలను మధ్యాహ్నం భోజనం తర్వాత మింగించి నులుపుల నివారణకు తోడ్పడుతారన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. రాజేష్ కుమార్ డాక్టర్ జె. వినయ్ కుమార్ డాక్టర్.సౌమ్య మండల విద్యాధికారిని డాక్టర్ ప్రమీల శ్రీ చైతన్య ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు, బద్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ టీ నర్సింహారెడ్డి, డిప్యూటీహెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బి వెంగయ్య హెల్త్ అసిస్టెంట్ జనార్ధన్, శిరామయ్య మరియు ఆరోగ్య సిబ్బంది లక్ష్మీదేవి ఆశా కార్యకర్తలు విద్యార్థినీ విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పాల్గొనడం అయినది.

## 68 ఎర్రచందనం దుంగలు స్వాధీనం



సిద్దవటం ఆగస్టు 12 ప్రభాతవార్త

కడప రేంజ్ లోని మద్దిమడుగు సెక్షన్ పాలకొండలో ఆపరేషన్ రెడ్ నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న 68 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని లారీ, రెండు కార్లను సీజ్ చేసినట్లు కడప ,డిఎఫ్ఓ వినీత్ కుమార్ తెలిపారు. కడప డిఎఫ్ఓ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేఖరుల డిఎఫ్ఓ మాట్లాడుతూ మద్దిమడుగు సెక్షన్ నుంచి ఎర్రచందనం అక్రమ రవాణాకు సిద్ధంగా ఉందనే సమాచారం వచ్చిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో కలిసి మద్దిమడుగు ఈస్ట్ బీట్, మద్దిమడుగు సెక్షన్, కడప రేంజ్, పాలకొండ రిజర్వ్‌డ్ ఫారెస్ట్, కడప బెంగళూరు ప్రధాన రహదారి సమీపంలోని మద్దివంక ప్రదేశంలో మంగళవారం తెల్లవారుఝామున గాలింపు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ గాలింపు చర్యల్లో భాగంగా మూడు వాహనాల్లో తరలించేందుకు సిద్దంగా ఉన్న 68 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న వీరబల్లికి చెందిన చమర్తి అమరేంద్ర రాజు, సీకే దిన్నె కు చెందిన డ్రైవర్ మూడే మల్లికార్జున నాయక్, చెన్నైకు చెందిన వాహన యజమాని కార్తీక్, చెన్నూరు మండలానికి చెందిన మిట్టా మాధవరెడ్డి, వీరబల్లికి చెందిన డ్రైవర్ దాసరి నాగేంద్ర, పంజాబ్ రాష్ట్రం లుధియానాకు చెందిన డ్రైవర్ గుర్నం సింగ్, మధ్యప్రదేశ్ మందసౌర్ కు చెందిన డ్రైవర్ అబ్దుల్ హాఫీజ్‌లను అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని డిఎఫ్ఓ తెలిపారు.

## 13న శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థాన హుండీ లెక్కింపు

సిద్దవటం ఆగస్టు 12 ప్రభాతవార్త

13న శ్రీ నిత్యపూజ స్వా మి దేవస్థాన హుండీ లెక్కింపు ఉన్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఏ. శ్రీధర్ తెలిపారు. సిద్ధవటం మండలంలోని వంతాటిపల్లి గ్రామ పంచాయతీలోని లంకమల అభయారణ్యంలో వెలసియున్న శ్రీ నిత్యపూజ స్వామి దేవస్థానమునకు సంబంధించిన హుండీలను 13వ తేదీన బుధవారము ఉదయం 10 గంటలకు దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో తెరిచి లెక్కించేందుకు నిర్ణయించడం జరుగుతుందన్నారు. కావున భక్తాదులు సదరు హుండీ పరకామణి నందు పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు అవ్వాలని ఆయన తెలిపారు.

## ఆధార్ కేంద్రాన్ని సద్వినియోగపరచుకోండి

ముద్దనూరు. ఆగస్టు12. ప్రభాతవార్త:

మండల పరిధిలోని ప్రజలు మేజర్ పంచాయతీ కార్యాలయంలోని సచివాలయం 1 లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం సేవలను మండల ప్రజలు సద్వినియోగపరుచుకోవాలని మండల అభివృద్ధి అధికారినీ పరిపూర్ణ అరుంధతి మంగళవారం నాడు ప్రకటనల ద్వారా ప్రజలను కోరారు. ప్రతి ఒక్కరూ ఆధార్ కార్డులో మార్పు, చేర్పులను ఆధార్ కేంద్రం ద్వారా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

## ఒక మాత్రతో నులిపురుగులను నిర్మూలిద్దాం

ముద్దనూరు. ఆగస్టు 12. ప్రభాతవార్త:



జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ సందర్భంగా మంగళవారం నాడు మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేటు ఇతర పాఠశాలలు జూనియర్ కళాశాలలో రెండు సంవత్సరాల నుంచి 19 సంవత్సరాల వయసు గల పిల్లలకు ఆల్బెండొజోల్ మాత్రలను ఉచితంగా పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పరిపూర్ణ అరుంధతి, వైద్య అధికారిని డా. కరిష్మా తెలిపారు. మానవ శరీరంలో ఈ నులిపురుగులు ఉండటం వలన ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులకు రక్తహీనత, నీరసంగా ఉండటము తల తిరగడము కడుపునొప్పి రాడము మొదలుకు లక్షణాలు ఉండటం వలన విద్యార్థి విద్యార్థులు ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యాంశాలు సరైన పద్ధతిలో అవగాహన చేసుకోలేరని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా పిల్లలలో నులిపురుగుల నిర్మూలన కొరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఆల్బెండజల్ మాత్రలను మింగించే కార్యక్రమం చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించి వ్యాధులకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కేంద్రం సిడిపిఓ కొండమ్మ, ఆరోగ్య విస్తరణ అధికారి శ్రీనివాసన్ రెడ్డి, వైద్య సిబ్బంది, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలు గ్రామాల్లో రైతులకు

మైదుకూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:



మండలంలోని బండి వారి పల్లి, తిమ్మాయపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఈ బాలగంగాధర్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలు,గ్రామాలలో సాగుచేసిన వివిధ పంటల స్థితిగతులు,పంట నమోదు, పంటల బీమా ఆవశ్యకత, గురించి రైతులకు తెలియజేయడం జరిగింది.అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ పథకం, భూమి కలిగిన రైతులకు రేషన్ కార్డులో ఒకరి చొప్పున 7వేల రూపాయలు ఇందులో రాష్ట్ర ప్రభుత్వం వారి అన్నదాత సుఖీభవ ద్వారా 5000 మరియు కేంద్ర ప్రభుత్వం వారి పీఎం కిసాన్ పథకం ద్వారా 2000 చొప్పున రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగింది. ఇంకా ఎవరైనా పడని వారు ఎవరైనా ఉంటే వ్యవసాయ కార్యాలయం వద్దకు లేదా మీ గ్రామాలలో ఉండే రైతు సేవా కేంద్రం వద్దకు వెళ్లి జాబితాలో మీ పేరు ఉందా లేదా చూసుకోవచ్చని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వినయ్ బాబు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, ఆయా గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది.

## వైసిపి నాయకుల అక్రమ అరెస్ట్‌ను నిరసిస్తూ

యర్రగుంట్ల ఆగస్టు 12 ప్రభాతవార్త



పులివెందుల జడ్పిటిసి ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డిని పోలీస్ అరెస్ట్ చేసి ఎర్రగుంట్లకు తరలించారు అక్కడ జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి అడ్డుకోవడంతో ఎంపీ తో పాటు మాజీ ఎమ్మెల్యేను నిడిజీవి గ్రామంలోని మాజీ ఎమ్మెల్యే నివాసంలో ఇద్దరినీ హౌస్ అరెస్ట్ చేశారు తదానంతరం ఎర్రగుంట్ల మండలం నిడిజివ్వి గ్రామం నుండి ఎంపీ అవినాష్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి భారీ ర్యాలీగా పాదయాత్ర చేస్తూ ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో బైఠాయించారు. భారీగా కార్యకర్తలు నాయకులు పోలీసులు పాల్గొన్నారు. అనంతరం అవినాష్ రెడ్డి మీడియాతో మాట్లాతు దేశంలో ఎక్కడ లేని విధంగా పులివెందులలో కని విని ఎరుగని చెత్త ఎన్నికలు జరుగుతున్నాయి. ఓట్లు వేసేది స్థానిక ఓటర్లు కాదు జమ్మలమడుగు కమలాపురం రాయచోటి ఎమ్మెల్యేల మనసులు దొంగ ఓట్లు వేస్తున్నారు. చంద్రబాబు పగబట్టాడని అర్థమవుతుంది. ఇలాంటి చెత్త ఎన్నికలను కనీవిని ఎరగలేదని కూటమి ప్రభుత్వం పై మండిపడ్డారు అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి పోలీసు వారు అడ్డుకున్న కూడా కడపవైపు బయలుదేరి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో కడప మేయర్ సురేష్ బాబు, ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి, కమలాపురం జార్జి నరేన్ రామాంజుల రెడ్డి, జమ్మలమడుగు మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , వైయస్సార్సీపి రాష్ట్ర నాయకులు గడ్డం వెంకటసుబ్బారెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే సుధా కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

## జాతీయ నుసి పురుగుల నివారణ దినోత్సవం



యర్రగుంట్ల ఆగస్టు 12 ప్రభాతవార్త

మండల పరిధిలోని చిలమకూరు మన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు జాతీయ నుసి పురుగుల నివారణ దినోత్సవం సోమవారం జరిపారు. సందర్భంగా డాక్టర్ సాయి చరిత రెడ్డి ఆధ్వర్యం లో రక్త హీనత గురించి అవాగాన సమావేశం నిర్వహించారు. నులి పురుగులు సోకిన విద్యార్థులు రక్త హీనత ,పోషకాహార లోపం,నీరసం,వెయిట్ లాస్ వంటి ప్రమాదకర లక్షణాలు వుంటాయని ,ప్రతి ఆరు నెలల కు నులి పురుగుల నివారణ కార్యక్రమంలో ఆబ్సెంట్ కాకుండా ఆల్బెండాజోలు టాబ్లెట్ భోజనం చేసిన అర్ధగాంత తరువాత చప్పరించి నమిలి మింగాలని,ప్రతిరోజు భోజనం ముందు,బాత్రూమ్ పోయవచ్చిన తరువాత హ్యాండ్ వాషింగ్ చేసుకోవాలని,సానిటరీ లెట్రినెస్ ఉపయోగించాలని తెలిపారు. వారానికి ఒక్కసారైనా గోర్లు కత్తిరించుకోవాలని, కూరగాయలు, పండ్లు శుభ్రమైన నీటితో కడికి వాడాలని తెలిపారు. విద్యార్థుల ఎవరైనా ఆబ్సెంట్ అయి ఉంటే ఈ నెల 20 ఆగస్ట్ తప్పకుండా టాబ్లెట్స్ మింగాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డెప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ నాగమునిరెడ్డి పరిసరాలు శుభ్రం గా ఉంచుకోవాలని,బయట తిరిగేటప్పుడు విద్యార్థులు, చెప్పులు ధరించాలని, పోషకహర నివారణకు ప్రొటీన్స్, కార్బోహైడ్రైట్స్, విటమిన్స్ వుండే ఆహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పార్వతమ్మ,హెల్త్ సూపెర్వైసర్లు ,శుభద్రమ్మ,రవికుమార్ ,ఆరోగ్య కార్యకర్త గంగా భవని,ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

## సహకార సంఘం సభ్యులు అమానుల్లా

పీలేరు ఆగస్టు 12 ప్రభాతవార్త :

పీలేరు సింగిల్ విండో డైరెక్టర్ గా ఎన్నికైన పీలేరుకు చెందిన అమానుల్లాకు ఘనంగా సన్మానం జరిగింది. శివరాం పురం నౌషాద్ అధ్యక్షతన పీలేరు పట్టణం బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ ఎదురుగా ఓ మీడియా కార్యాలయంలో కార్యక్రమం జరిగింది. అమానుల్లా మాట్లాడుతూ నా మీద నమ్మకంతో గొప్ప అవకాశాన్ని కల్పించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. దాంతోపాటు సహకార సంఘం అధ్యక్షులు యల్లెల రెడ్డప్ప రెడ్డి సలహాల మేరకు సంబంధిత సభ్యులకు సహాయ సహకారాలు అందిస్తూ అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ డైరెక్టర్ లు గోళ్ళ కిషోర్ నాయుడు, లక్ష్మీకాంతమ్మ, చంద్రలేఖ, షమ, కే జి ఎన్ రెడ్డి బాష,అల్లా బకష్, సయ్యద్ బాషా, మస్తాన్, బాబు, భార్గవ్, పలువురు ముస్లింలు,టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


అమానుల్లా ను సన్మానిస్తున్న దృశ్యం

## ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు సురక్షితం

పీలేరు ఆగస్టు 12 ప్రభాతవార్త:


మందులు వేస్తున్న వైద్యులు

నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని బాధ్యతతో నెరవేర్చి పిల్లల ఉజ్వల భవిష్యత్తును అందించుటలో అందరూ సహకరరించాలని తలుపుల వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్ అర్జించారు. నేడు డివార్మింగ్ ప్రారంభోత్సవ్ కార్యక్రమంలో తలుపుల ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ పాల్గొని పిల్లలకు మంచి అలవాట్లతో నులిపురుగుల బారిన పడకుండా ఎలాగో వివరించి స్కూల్ విద్యార్థులకు అల్బెండజోల్ 400 యం జి మాత్రలు పంపిణీ చేసి అక్కడ విద్యార్థులకు మరియు ఆరోగ్య టీచర్స్ కి మంచిజీవనశైలి విద్యార్థికి ఎలా ఉపకరిస్తుందో మెరుగైన సూచన సలహాలు ఇచ్చారు. పి హెచ్ సి తలుపుల పరిధిలోని గుర్తించిన అర్హత కల్గిన పిల్లలు(లబ్ధిదారులు) మొత్తం10824 కాగా, ఈ రోజు మాత్రలు వేసిన పిల్లలు10473 తో 96 శాతం ప్రగతి సాధించినట్లు డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యయులు పర్యవేక్షకులు కృష్ణయ్య ఏఎన్ఎం పాముస్నిసా ఆశా కార్యకర్తలు విద్యార్థులు. పాల్గొన్నారు.

## సీతరగానిపల్లె లో పశువైద్య శిబిరం

రామసముద్రం ఆగస్టు 12 ప్రభాతవార్త

రామసముద్రం గ్రామ పంచాయతీ లోని సీతరగానిపల్లి గ్రామంలో మంగళవారం పశు వైద్య శిబిరం పశువైద్యాధికారి పావని నిర్వహించారు. ఈ సందర్భంగా పావని మాట్లాడుతూ పశువులకు బుటాక్ స్ప్రే 175 దూడలకు నివారణ 46 గర్భకోశ వ్యాధులు 29 ప్రథమ చికిత్స 19 నిర్వహించడం పశువులకు వ్యాక్సిన్ వేయడం జరిగిందన్నారు..అలాగే ముద్దచర్మ వ్యాధిపై రైతులకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో పశువులకు వచ్చే వ్యాధులపై పశువైద్య డాక్టర్ లు సలహాలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో జేఈవో భాను ప్రకాష్,ఎల్ ఏ దత్తాత్రేయ,ఏహెచ్ఎల్ నరేష్,రవి,రైతులు పాల్గొన్నారు.

## విద్యార్థి విభాగం ఉపాధ్యక్షులుగా మల తోటి నరేష్


నియామక పత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే

పీలేరు ఆగస్టు 12 ప్రభాతవార్త :

నియోజకవర్గంలోని కలికిరి మండలం అద్దవారి పల్లి పంచాయితీ కి చెందిన మలతోటి నరేష్ ని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అన్నమయ్య జిల్లా ఉపాధ్యక్షులుగా నియామిస్తూ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం నియామక పత్రం అందజేశారు. కలికిరి మండలం కలికిరి పట్టణంలోని అజయ్ ఫంక్షన్ హాల్ నందు సోమవారం మండల స్థాయి వైఎస్ఆర్ సీపీ విస్తృత స్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ, మండల, జిల్లా స్థాయి వైయస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఈ సంధర్భంగా పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, వైయస్సార్సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, సంయుక్తంగా ఉత్తర్వులు జారీ చేసిన నియామక పత్రాన్ని మలతోటి నరేష్ కు మాజీ ఎమ్మెల్యే అందజేశారు. ప్రజలతో మమేకమై, వైయస్సార్సీపీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి చేర్చేలా, వైఎస్ఆర్సిపి బలోపేతం కోసం కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే సూచించినట్లు మలతోటి నరేష్ తెలిపారు. తన పై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్ రెడ్డికి, పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, ఈకార్యక్రమంలో రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ అధ్యక్షులు నల్లారి తిమ్మారెడ్డి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, ఏపీఎండీసీ రాష్ట్ర మాజీ డైరెక్టర్ హరీష్ రెడ్డి, వైఎస్ఆర్సిపి పచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరి ప్రసాద్ రెడ్డి, రాష్ట్ర విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకర చక్రధర్, అన్నమయ్య జిల్లా యూత్ ఉపాధ్యక్షులు పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, కి వైఎస్ఆర్సిపి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్యా యత్నం

మదనపల్లెక్రైమ్, ఆగస్టు 12 ప్రభాతవార్త.

కుటుంబ సమస్యలతో గొడవ పడిన మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. ఈ సంఘటన మంగళవారం మదనపల్లె పట్టణంలో జరిగింది. బాధితురాలి కుటుంబ సభ్యుల కథనం మేరకు.. నీరుగట్టువారి పల్లి, మారుతినగర్ కు చెందిన వెంకటేష్ భార్య కృష్ణమ్మ (44) కుటుంబ సమస్యలపై గొడవ పడింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని వెంటనే కిందికి దింపి చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతికి రిఫర్ చేశారు. బాధితురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

మదనపల్లె, ఆగస్టు 12 ప్రభాతవార్త :

జిల్లాలో పెండింగ్‌లో ఉన్న నీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మహేష్ కోరారు. జిల్లాలోని మదనపల్లె వేదికగా రెండు రోజులు పాటు సిపిఐ మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా నూతన కార్యదర్శి, సహాయ కార్యదర్శులు కార్యవర్గంతో పాటు జిల్లా కమిటీ సభ్యులను ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ మూడు రోజులు పాటు జరిగిన మహాసభల్లో జిల్లా అభివృద్ధిపై చర్చించి భవిష్యత్తులో కార్యక్రమాన్ని రూపొందించుకోవడం జరగిందన్నారు. రాబోయే రోజుల్లో కడప నుంచి రాయచోటి మదనపల్లె మీదుగా బెంగుళూరు రైల్వేలైన్ పనులు పున:ప్రారంభించాలని, హంద్రీనీవా కాలువ వెంటనే పూర్తి చేయాలని, పెండింగ్‌లో ఉన్న చిప్పిలి సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకును పూర్తి చేయాలని, ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వ ఆదీనంలోనే నడపాలని, బిటీ కళాశాల ఆస్థులను ప్రభుత్వమే స్వాధీనం చేసుకోవాలని, కళాశాలను అభివృద్ధి చేసి వృద్ధి, విద్య కోర్సులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి క్రిష్ణప్ప మాట్లాడుతూ నియోజకవర్గాల అభివృద్ధికి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పాలకులు గాలికి విదిలివేశారన్నారు. నిమ్మనపల్లె, రామసముద్రం రోడ్డును డబుల్‌రోడ్డుగా ఎన్నికల అజెండాలోనే మిగిలిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గసభ్యులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, దేవరా, సాంబశివ, సుధీర్, నియోజకవర్గ కార్యదర్శి మురళి, జిల్లా నాయకులు రంగారెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

## ప్రజల సౌకర్యార్థం బ్యాంకు స్థలం మార్పు చేయాలి

జమ్మలమడుగు, ఆగస్టు 12, ప్రభాతవార్త:

జమ్మలమడుగు పట్టణంలోని ప్రొద్దుటూరు రోడ్డులో గల కెనెరా బ్యాంకు చిన్నదిగా ఉన్నందున ప్రజలు, ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ప్రజల సౌకర్యార్థం బ్యాంకు మార్పు పెద్ద భవనంలో చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాళ శివకుమార్ తెలిపారు. బ్యాంకు ప్రజల సౌకర్యార్థం ఇతర చోటుకు మార్చాలని కోరుతూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కెనెరా బ్యాంకు మేనేజరుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల వద్ద నుంచి అనేక రూపాలలో లాభాలు పొందుతున్న బ్యాంకు ప్రజలకు, ఖాతాదారులకు సౌకర్యాలు, భద్రత కూడా కల్పించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు ప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు సుభహాన్, సహాయ కార్యదర్శి మహేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రిమ్స్ నందు అన్నదానం



కడప ఆగస్టు12. ప్రభాతవార్త

మాజీ ఎమ్మెల్యే కందుల శివానందరెడ్డి జ్ఞాపకార్థం, అన్నం పరబ్రహ్మ స్వరూపం అనే భావనతో, కడప రిమ్స్ నందు ప్రతి మంగళవారం మరియు శుక్రవరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నాం అని కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి తెలిపారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ తండ్రి వారి జ్ఞాపకార్థం 2024 నవంబర్ నుంచి అన్నదాన సేవ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందిని తెలిపారు. ప్రతీ వారం సుమారుగా 1000 భోజన పొట్లాలు మరియు మనిషికి 2 వాటర్ ప్యాకెట్లు పంచుతున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే , రిమ్స్ లో మార్చురి వార్డ్ దగ్గర్లో గల మెంటల్ రీహాబిలిటేషన్ సెంటర్ నందు గల 70 మందికి అదనంగా భోజన పొట్లాలు పంచుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా తమ విద్యా సంస్థలో చదువుతున్నా వివిధ బ్రాంచ్ లో చదువుతున్న విద్యార్థులు, 10 మంది వరకు స్వచ్చందంగా ముందుకు వచ్చి ప్రతీ వారం భోజన ప్యాకెట్ ప్యాకింగ్ మరియు వితరణ సమయానికి రిమ్స్ నందు సహకరిస్తున్నారు అని తెలిపారు.

## ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మైదుకూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:

ఏపీఎస్ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రెండు రోజులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపో యూనిట్లలో ఎన్.ఎం.యు.ఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా కార్యక్రమములలో జిల్లా కార్యదర్శులు డిపో అధ్యక్ష కార్యదర్శులు ధర్నా కార్యక్రమంలో మాట్లాడుతూ తక్షణమే పి ఆర్ సి కమిషన్ ఏర్పాటు,వేతన సవరణ,ఐ.ఆర్,విశాఖ స్టీల్ ప్లాంట్ డిపో తరలింపు ఆపాలి, పెండింగ్ లో డి.ఏ,రిటైర్ అయిన ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్మెంట్, ఖాళీలను డైరెక్ట్ రిక్రూట్మెంట్,ప్రమోషన్స్,గ్యారేజీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలు,మహిళా ఉద్యోగులకు ప్రభుత్వ జీవో ప్రకారం పిల్లల సంరక్షణ సెలవులు,నానాపరేషన్ఉద్యోగుల పెండింగ్ సమస్యలు,ఉద్యోగులకు అనారోగ్య సెలవులకు పూర్తి జీతం,ఈ.హెచ్.ఎస్ స్థానంలో పాత వైద్య విధానం, ఎలక్ట్రిక్ బస్సులను స్వయంగా ప్రభుత్వం ద్వారా లేదా సంస్థ ద్వారా కొనుగోలు,ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థపరంగా వేతనాలు చెల్లించాలి,గత 6నెలలు నుంచి పెండింగ్లో ఉన్న మన మెమరాండంలోని సమస్యలపై చర్చించి పరిష్కరించాలి,ఏపీఎస్ఆర్టీసీ లో ఎక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే క్యాడర్ స్ట్రెంగ్థ్ లో ఉండేవిధంగా అమలు, తీవ్రమైన అనారోగ్య కారణాలతో బాధపడుతున్న ఉద్యోగులకు ఓడీలు, ఉద్యోగుల అవసరాన్ని బట్టి ఈ.ఓ.ఎల్ లో మంజూరు,పార దర్శకమైన ట్రాన్స్ఫర్ పాలసీని అమలు,ఆఫీసు సిబ్బంది దీర్ఘకాలిక సమస్యలు,రిటైర్ ఉద్యోగుల దంపతులకు సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణం కల్పించాలని పై సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ మరియు గ్యారేజ్ ఉద్యోగులు డిపో ప్రెసిడెంట్ నాగరాజు, గ్యారేజ్ కార్యదర్శి రాయుడు, ట్రెజరర్ రాయుడు, వెంకటేశ్వర్లు, పురుషోత్తం, జి.సి.ఏం రెడ్డి,ఏం.వి రావు, బి.ఏం.రావు, నారాయణ, అహ్మద్, ఉద్యోగులు పాల్గొన్నారు.

## పిచికారి డ్రోన్ల ద్వారా చేయడం అధిక ప్రయోజనం



ప్రొద్దుటూరు, ఆగస్టు 12 ప్రభాతవార్త :

ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి మంగళవారం మండలంలోని చెన్నమరాజుపల్లె గ్రామానికి మంజూరైన వ్యవసాయ పంటలకు పురుగుమందు పిచికారీ చేసే డ్రోన్ యంత్రాన్ని ప్రారంభించారు. అనంతరం శిక్షణ పొందిన ఆపరేటర్ డ్రోన్ ట్రైల్ రన్ ను గ్రామస్థులకు చూపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. సబ్సిడీ క్రింద అందించే విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను రైతులు రైతు సేవా కేంద్రాల నుండి పొంది ప్రయోజనం పొందాలని సూచించారు. కాగా ఈ డ్రోన్ విధానం ద్వారా పురుగుల మందు పిచికారీ చేయడం వలన రైతుకు శ్రమ, వ్యయం తగ్గడంతో పాటు ప్రతి మొక్కకు చేరుతుందని వివరించారు. 80 శాతం సబ్సిడీ పోనూ 20 శాతం ఈఎంఐ ద్వారా చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. అనంతరం జెడిఏ చంద్రనాయక్ మాట్లాడుతూ మండలానికి ఒక డ్రోన్ ప్రస్తుతం మంజూరైందని, 5 మంది ఒక గ్రూప్ గా ఏర్పడి దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వం మంజూరు చేసే అవకాశం ఉందని తెలిపారు. అదేవిధంగా రైతులు యూరియా, ఎరువులు, పురుగుమందులు అధికంగా వాడటం వలన భూమి నిస్సారమయ్యే ప్రమాదం వుందని, యూరియా ను 3 దఫాలుగా పిచికారీ చేయడంతో పాటు ఎరువులు, పురుగు మందులను కూడా సమపాళ్లలో వినియోగించాలని సూచించారు. సందేహాలుంటే రైతు సేవా కేంద్రంలో అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ అనిత, చెన్నమరాజుపల్లె సర్పంచ్ రాజువారి ఆదిలక్షుమ్మ, మాజీ సింగిల్ విండో ఛైర్మన్ రాజువారి వెంకటసుబ్బయ్య, అగ్రికల్చర్ అసిస్టెంట్ సుమలత, స్థానిక నాయకులు రాజువారి బలరాముడు, వెంకట సుబ్బయ్య, గంగులు, శ్రీనివాస్ రెడ్డి, శివ, సత్యం, శేషారెడ్డి, బాలయ్య, కసిరెడ్డి సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగల వాడకంపై అవగాహన

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 12, ప్రభాతవార్త:



పట్టణంలోని మున్సిపల్ హైస్కూలు, రామేశ్వరం, బొల్లవరం అంగన్వాడీ కేంద్రం నందు జాతీయ నులి పురుగుల నిర్మూల గురించి మంగళవారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డా.గీత విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కాలేజీలలో 1 నుంచి 19 సంవత్సరాల వరకు పిల్లలకు ఈ మాత్రలు వాడి నులి పురుగల నివారణ చేయాలన్నారు. కిశోర బాలలు వివిధ ప్రమాదకరమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటారని వాటన్నింటికి శుభ్రమైన నీటిని తాగాలని, గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కొంత మంది పిల్లల్లో చాలా కాలం నుంచి నులిపురుగులు ఉన్నా లక్షణాలు బయటకు కనిపించకుండా ఉంటాయని తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈ ఆల్బండజోల్ మాత్రలు వేయించి ఆరోగ్యంగా ఉండేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డా. మౌనిక, డా.హిమబిందు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, శోభారాణి, సీఓ సుబ్బారెడ్డి, ఏఎన్ఎం అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలి.

### అడిషనల్ డిఎం అండ్ హెచ్ ఓ రమేష్ బాబు



మదనపల్లె క్రైమ్ ఆగస్టు 12 ప్రభాతవార్త.

హెచ్ఐవీపై ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రమేష్ బాబు తెలిపారు. మంగళవారం జిల్లా ఆసుపత్రి వద్ద ఏ ఆర్ టి ఐసీటీసీ, ఆర్ఆర్ఎస్, జన చేతన స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఇండియా ఫైట్స్ హెచ్ఐవీ అండ్ ఎస్ టి ఐ అనే థీమ్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ రమేష్ బాబు మాట్లాడుతూ హెచ్ఐవి నిర్మూలనకు రెండు నెలలపాటు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్న మన్నారు. జిల్లాలో 88 కాలేజీలను గుర్తించి ఆ కళాశాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. హెచ్ఐవి వ్యాధి ఎలా సోకుతుంది, ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే విషయాలను వివరించాలన్నారు. అందరి సహకారంతో అవగాహన కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెంట్ కోటేశ్వరి, ఏఆర్టి మెడికల్ ఆఫీసర్లు మేఘన, హుమయున్ భాష, ఐసిటీసీ జయ కుమార్, ఆర్ఆర్ఎస్ పురుషోత్తం, జనచేతన వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## కనుమ పోలేరమ్మ అమ్మవారి రథోత్సవం

బ్రహ్మంగారిమఠం ఆగస్టు 12 ప్రభాతవార్త.



ప్రముఖ పుణ్యక్షేత్రమైన జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారికి నిప్పు తెచ్చిన శ్రీ కనుమ పోలేరమ్మ ఆలయం వద్ద ప్రతి ఆదివారం, శుక్రవారం, మంగ్లవారం రోజున శ్రీ అమ్మవారి గుడి చుట్టూ శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారిని ఊరేగింపుగా రథోత్సవం నిర్వహిస్తామని పిట్ పర్సన్ శంకర్ బాలాజీ తెలిపారు, మంగ్లవ్వార ప్రకాశం జిల్లా కనిగిరి వాస్తవ్యులు బ్రహ్మయ్య వారి ధర్మపత్ని కవిత రథోత్సవంనకు ఉభయ దాతలైన రథోత్సవాన్ని నిర్వహించారు.శ్రీవీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఫిట్ పర్సన్ శంకర్ బాలాజీ ,మేనేజర్ ఈశ్వరయ్య ఆచారి ఆదేశాలు మేరకు అమ్మవారి రథోత్సమును నిర్వహిస్తూన్నమని ఈ అవకాశాన్ని భక్తులందరూ ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని శ్రీ కనుమ పోలేరమ్మ అమ్మవారి ఆశీస్సులు పొందగలరని వారన్నారు. ఈ కార్యక్రమం లో అర్చకులు ప్రసాద్ ,మిథున్, సిబ్బంది చిన్న సుబ్బారాయుడు,భక్తులు తదితరులు పాల్గొన్ని రథోత్సవంను జయపదం చేశారు.

## ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

పీలేరు, ఆగస్టు 12 ప్రభాతవార్త:

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్ఎంయూ జిల్లా కార్యదర్శి పి.ఎస్.ఎం. రాజు అన్నారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ గ్యారేజ్ ఎదుట రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ బస్సులను ఆర్టీసీ యాజమాన్యమే కొనుగోలు చేయాలని కోరారు. ఆర్టీసీ ఖాళీ జాగాలు ప్రయివేట్ పరం చేయరాదన్నారు. పెండింగ్లో ఉన్న ప్రమోషన్లు వెంటనే భర్తీ చేయాలని కోరారు. పెండింగ్లో ఉన్న పీఆర్సీ, డీఏ లీవ్ ఎన్క్యాష్మెంట్ వెంటనే చెల్లించాలన్నారు. ఆర్టీసీలో ఉన్న ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్ష, కార్యదర్శులు సి.వి. రమణ, ఆదినారాయణ, ఎన్ఎంయూ నాయకులు బి.పి. నాయుడు, పి. మధుసూదన్, బీఆర్బీ నాయక్, ఎం.హెచ్.నాయుడు. నారాయణ తదితరులు పాల్గొన్నారు.



## మదనపల్లెలో ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు

### ఎమ్మెల్యే షాజహాన్బాషాచే పట్టణంలో భారీ బైక్ర్యాలీ

మదనపల్లె, ఆగస్టు 12 ప్రభాతవార్త :

మదనపల్లెలో మంగళవారం ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే షాజహాన్బాషా ఆధ్వర్యంలో పట్టణంలో పెద్దఎత్తున బైక్ర్యాలీ నిర్వహించారు. మూడు రోజులు పాటు జరగే స్వాతంత్ర్య దినోత్సవ సంబరాల్లో భాగంగా తొలిరోజు బసినికొండ నుంచి జాతీయ జెండాలతో చౌడేశ్వరీ కళ్యాణ మండపం వరకు 1000మందితో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవాలన్నారు. ముందస్తుగా పట్టణంలో మూడు రోజులు పాటు స్వాతంత్ర్య దినోత్సవాలు అన్ని శాఖాల విభాగాలు, ప్రజాసంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థులు, ప్రజలతో కలసి జరుపుకోవడం జరుగుతుందన్నారు. మదనపల్లె స్వాతంత్ర్య ఉద్యమ గడ్డగా పేరు పొందిందన్నారు. ఇక్కడ నుంచే హోమ్రూల్ ఉద్యమం ప్రారంభమైందన్నారు. జాతీయ గీతాన్ని కూడా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మదనపల్లెలోని బిటి కళాశాలలోన ఆంగ్లంలోకి అనువధించడం జరిగిందన్నారు. ఎంతో విశిష్టత కలిగిన మదనపల్లెలో స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు వైభవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం మిషన్కాంపౌండ్ నుంచి అనిబిసెంట్ సర్కిల్ వరకు కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు, స్వచ్ఛందసంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు, మేథావులు, మాజీ సైనికులు, రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి దేశభక్తిని చాటుకోవడం జరుగుతుందన్నారు. బైక్ర్యాలీలో ఎమ్మెల్యేతో పాటు టౌన్బ్యాంకు ఛైర్మెన్ నాదేళ్ళ విద్యాసాగర్, నవీన్ చౌదరి, జేసిబి వేణు, మధు, జీవి.నాయుడు, షంషీర్, సుదర్శన్రెడ్డి, రఘుపతినాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



బైక్ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

## మాత శిశు సంరక్షణకు కృషి చేయండి

### రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్ కుమార్... పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

మదనపల్లెక్రైమ్, ఆగస్టు 12ప్రభాతవార్త.

మాత శిశు సంరక్షణకై వైద్య ఆరోగ్య సిబ్బంది క్షేత్రస్థాయిలో మరింతగా కృషి చేయాలని రాష్ట్ర అదనపు సంచాలకులు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని అమ్మ చెరువు మిట్ట లో ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్, స్థానిక సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఆరోగ్య చికిత్సలు, వైద్య పరీక్షలు తదితర అంశాలపై సిబ్బందికి సూచనలు చేశారు. మాత శిశు సంరక్షణకై అవసరమైన మందులు యూపీహెచ్సీలో అందుబాటులో ఉన్నాయా? అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గైనిక్ సమస్యలపై వచ్చే రోగులను స్క్రీనింగ్ చేస్తున్న విధానం, గర్భవతులు, కాన్పులు తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా ప్రసవాలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే జరిగేలా వైద్య ఆరోగ్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఆస్పత్రి ఓపిక వచ్చే రోగులకు తప్పనిసరిగా వైద్య పరీక్షల్లో భాగంగా ఈ హెచ్ ఆర్ చేయించాలన్నారు. కుటుంబ సంక్షేమంలో భాగంగా అర్హులైన దంపతులు బిడ్డకు బిడ్డకు మధ్య ఎడం పాటించేలా సిబ్బంది అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డి ఎం అండ్ హెచ్ ఓ రమేష్ బాబు, ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ లోకవర్ధన్,104 జిల్లా నోడల్ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్, యు పి హెచ్ సి వైద్యులు భార్గవి, హరికృష్ణ, ప్రసాద్, హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.



## వివాహిత అదృష్యం

దువ్వూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని పెద్ద భాకరాపురం గ్రామానికి చెందిన నబీల్లా బేబి ఈ నెల 11 వ తేదిన అదృష్యం అయినట్లు భర్త బాదుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బేబి 11వ తేది ఇంటిలో ఉండగా అత్తా, మామ, పిల్లలు 3గంటల వరకు ఇంటిలో ఉండి తర్వాత బేబి తన బ్యాగును సర్దుకొని వెళ్లిపోయినట్లు తెలిపారు. వెళ్లిపోయే సమయంలో ఇంటిలో బీరువాలో ఉన్న నగదు, రెండు ఉంగరాలు కూడ తీసుకెళ్లినట్లు భర్త ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను డ్రైవర్గా జీవనం కొనసాగిస్తూ డ్యూటీపై వెళ్లగా తన బార్య కనిపించలేదని ఫిర్యాదులో తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ భూషణం తెలిపారు.

## సిహెచ్సిని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్



తంబళ్లపల్లె ఆగస్టు 12 ప్రభాతవార్త ః

తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మదనపల్లి సబ్ కలెక్టర్ చల్లా కళ్యాణి మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆమె ఆసుపత్రిలోని ప్రసూతి వార్డు, ఓపి, ఎక్రే యూనిట్, ఫిజియోథెరపీ యూనిట్ తనిఖీ తోపాటు పలువురు రోగులను తమకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏడు మంది డాక్టర్లు ఇస్తానే ముగ్గురే ఉన్నారని రోగులకు సకాలంలో వైద్య సేవలు అందడం లేదని ఇంకా పలు సమస్యలను టిడిపి నాయకుడు మాజీ జెడ్పిటిసి రామచంద్ర సబ్ కలెక్టర్కు తెలియజేశారు. ఆమె వెంటనే స్పందించి ఆసుపత్రిలో మొత్తం డాక్టర్లు, వైద్య సిబ్బంది పని తీరు, ఓపికి ఎంతమందిలో గులాజరవుతారు, అత్యవసర కేసులు, డెలివరీలు, ఇంకా ఎదురవుతున్న సమస్యలపై డ్యూటీ డాక్టర్ అమర సింహరాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె తంబళ్లపల్లె సామాజిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ల సమస్యతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆమె వెంట ఎంపీడీవో థామస్ రాజా, డిప్యూటీ తాసిల్దార్ నవీన్, ఆర్ ఐ ముద్దు కృష్ణ, హెడ్నర్స్ గ్లోరీ, ఐ సి టి సి కౌన్సిలర్ చంద్రమోహన్, ఎల్ టి బాలాజీ, గోవర్ధన్, వీఆర్వో నాగరాజు సిబ్బంది పాల్గొన్నారు.

## నులి పురుగుల మందు పంపిణీ

దువ్వూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:



మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు అలాగే జూనియర్ కళాశాలలో చదివే విధ్యార్థిని, విధ్యార్థులకు మంగళవారం జాతీయ నులిపురుగుల దినోత్సవం సంధర్భంగా అల్బండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్లు డాక్టర్ సురేష్ బాబు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో 6నెలలకు ఒక సారి నులిపురుగుల నివారణకు ఈ మందును పంపిణీ చేస్తారన్నారు. వీటి వల్ల విధ్యార్థిని, విధ్యార్థుల్లో రక్తహీనత, నీరసం, తల తిరగడం, కడుపు నొప్పి వంటిని రావన్నారు. మండలంలో 9525మంది 0 నుండి 19సంవత్సరాలలోపు పిల్లలు ఉండగా వారిలో 9319మందికి మాత్రలు పంపిణీ చేశామన్నారు. 98 శాతం మందికి నులి పురుగు మాత్రలు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు షేక్ రోషిని, హేమలత, సిబ్బంది రాజగోపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొత్తగా ఎన్నికైన కానిస్టేబుళ్లకు సన్మానం

దువ్వూరు, ఆగస్టు 12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని నీలాపురం సుగాలితాండాకు చెందిన బుక్కే శ్రీను నాయక్ అలాగే కృష్ణా నాయక్లు ఇద్దరు ఇటివల ఆంధ్రప్రదేష్ ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ రిక్రూట్మెంట్ ద్వారా కానిస్టేబుళ్లుగా ఎంపికైన సంధర్భంగా వారిద్దరిని మంగళవారం గ్రామస్థులు సన్మానించారు. సర్పంచ్ పల్లె రామయ్య ఆధ్వర్యంలో ఇద్దరిని ఘనంగా సన్మానించారు. ఈ సంధర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారు మరిన్ని పదోన్నతులు పొంది గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మోహన్ రెడ్డి, సురేంద్ర, శివశంకర్ రెడ్డి, ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బురదమయం... ఆ రోడ్డు...



ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 12 ప్రభాతవార్త :

పట్టణంలోని 1వ వార్డు బొల్లవరం లో మహర్షి ఆశ్రమం వీధి వానొస్తే బురదమయం అవుతుంది. వివరాల్లోకెళితే.... ప్రొద్దుటూరు లోని బొల్లవరం మహర్షి ఆశ్రమం వీధి చిన్నపాటి వర్షానికే బురదమయం అవుతుంది. దీని వలన స్థానిక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. చిన్నపిల్లలు, పాదచారులు ఈ బురద కారణంగా జారిపడే ప్రమాదం వుందని స్థానికులు పేర్కొంటున్నారు. కావున అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మత్తు చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఓటు హక్కు కల్పించండి

### ఆర్వోకి పిర్యాదు చేసిన పలు గ్రామస్థులు



ఆర్వోకి పిర్యాదు చేస్తున్న కణంపల్లి గ్రామస్తులు

పులివెందుల, ఆగస్ట్ 12 ప్రభాత వార్త:

జడ్పిటిసి ఉప ఎన్నికల సంబంధించి అచ్చవెల్లి, ఎర్రిపల్లె, కనంపల్లి మరియు ఇతర గ్రామస్తులు తమకు రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కల్పించాలని ఎన్నికల అధికారికి వినతి పత్రం అందించారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయానికి ఏ ఆర్ ఓ కృష్ణమూర్తి కలిసి ఎన్నికల్లో తమను ఓటు వేయకుండా టీడీపీ నాయకులు, పోలీసులు అడ్డుకొని మా ఓటు వారే వేశారని మాకు ఓటు హక్కు కల్పించాలని వినత పత్రంలో పేర్కొన్నారు.తిరిగి రీపోలింగ్ జరపాలని కోరారు. అలాగే ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని కలిసి ఇతర మండలాల నాయకులు వచ్చి దొంగ ఓట్లు వేశారని తమగోడును విన్నవించుకున్నారు. దానికి రుజువుగా వారి చేతి వెళ్లకు ఇంకు కూడా లేదని వారి చేతి వేళ్ళని ఎంపీ కి చూపించడం జరిగింది.

## చిన్నపిల్లలకు జారుడుబండలు వితరణ..

సుండుపల్లి, ఆగస్టు12, ప్రభాతవార్త:

మండల పరిధిలోని సుండుపల్లె టౌన్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో గల అంగన్వాడీ కేంద్రానికి ఖిమానవత సంస్థఖి డైరెక్టర్ మరియు ఉపాధ్యాయుడు అయినటువంటి రవీంద్రనాధరెడ్డి ఒక జారుడుబళ్ళను విరాళముగా ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో మండల విద్యాశాఖధికారి రవినాయక్, ఆర్థిక కార్యదర్శి నరసింహ, సభ్యులు సుధాకర్ రెడ్డి, నారాయణ నాయక్, ప్రకాష్ నాయక్, రజని పాల్గొన్నారు.







కడప జిల్లా

పోరుమామిళ్ళ, చెన్నూరు, కొండాపురం,

ఎర్రగుంట్ల రూరల్, అట్లూరు, సికెదిన్నె,

కడపక్రైమ్, చక్రాయపేట

అన్నమయ్య జిల్లా

చిన్నమండెం, వాయల్పాడు, రైల్వేకోడూరు,

వీరబల్లి, రాయచోటి, నందలూరు, కలకడ,

ఇంటర్వ్యూ తేది : 16.08.2025

మీ పూర్తి బయోడేటాతో ఈ క్రింది చిరునామాలో సంప్రదించగలరు.

వార్త కార్యాలయం, డోర్ నెం. 1-2237, హౌసింగ్ బోర్డు కాలని,

విశ్వేశ్వరయ్య సర్కిల్ దగ్గర, రైల్వేస్టేషన్ రోడ్డు, కడప.

సెల్ నెం. 9848787289, 8919566086